

ఆంధ్రజ్యోతి
20
www.andhrajyothy.com
నిజామాబాద్
ANDHRAJYOTHY



శనివారం 5 ఆగస్టు 2017





# ఖరీఫ్ కష్టమే..

- జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు కటకట
- నమోదు కాని సగటు వర్షపాతం
- 490 మి.మీలకు కురిసింది కేవలం 318 మి.మీలు మాత్రమే
- ఎండుతున్న వరి, ఇతర పంటలు
- వేసిన పంటలు సైతం చేతికొచ్చే పరిస్థితి కరువు
- ఆందోళనలో జిల్లా రైతాంగం
- సర్కారే ఆదుకోవాలని డిమాండ్


జిల్లాలో ఈ యేడాది ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికొచ్చేలా కనిపించడం లేదు. గత యేడాది మాదిరిగానే ఈసారి కూడా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశించిన రైతాంగం వరి సాగును భారీగా చేపట్టింది. వరుణుడిపై ఎన్నో ఆశలతో వరి సాగు మొదలు పెట్టినప్పటికీ నేటికీ జిల్లాలో సగటు వర్షపాతం నమోదు కాలేదు. జూన్ నుంచి ఇప్పటి వరకు 490 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా.. 318 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే పడింది. గతంతో పోల్చితే చాలా తక్కువగా వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ యేడాది జిల్లాలో 4.83 లక్షల ఎకరాలలో పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేసినప్పటికీ.. ఇప్పటి వరకు కేవలం 3.5 లక్షల ఎకరాలలో మాత్రమే పంటలు సాగయ్యాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వేసిన పంటలు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

( ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ )



అర్సపల్లిలో ఎండిన పొలాన్ని చూపిస్తున్న రైతు

సెంటర్ స్ప్రెడ్‌లో...



# గుది'బండ'..!

- సామాన్యుడికి ఇక భారం కానున్న వంటగ్యాస్
- సబ్సిడీ సిలిండర్‌పై ప్రతి నెలా రూ.4పెంపునకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- కామారెడ్డి జిల్లాలోని వినియోగదారులపై ఏడాదికి రూ.1.10 కోట్ల అదనపు భారం

ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ఉక్కిరి బిక్కిరవుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. వంట గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేసేందుకు నిర్ణయించి వంటింట్లో బాంబ్ పేల్చింది. నెలకు రూ.4 చొప్పున పెంచుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని తొలగించేందుకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని భారం పడనుంది. కేంద్రం సర్కారు నిర్ణయంతో కామారెడ్డి జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై సంవత్సరానికి రూ.1.10 కోట్ల భారం పడనుంది. దీంతో వినియోగదారుల్లో అందోళన నెలకొంది. ఈ అంశంపై కేంద్రం పునరాలోచించాలని కోరుతున్నారు.

.....వివరాలు 8లో

7

# గొర్రెల పంపిణీలో.. అక్రమాలను సహించం

- ఎక్కడైనా జరిగితే బాధ్యులను వదిలిపెట్టం
- జిల్లాలో అర్హులందరికీ యూనిట్లను ఇస్తున్నాం
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ యోగితా రాణా
- 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ప్రచురితమైన 'గొర్రెల రీ సైక్లింగ్' కథనంపై స్పందించిన కలెక్టర్



# భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

- వరలక్ష్మీ దేవిని భక్తితో కొలిచిన సుహాసినులు
- ముగ్గురమ్మలకు విశేషంగా భక్తుల పూజలు
- పరస్పరం వాయనాలు ఇచ్చుకున్న మహిళలు
- జిల్లా వ్యాప్తంగా వెల్లివెరిసిన భక్తిభావం ...లోపలి పేజీల్లో



నాందేవ్‌వాడలోని సంతోషిమాతను కరెన్సీతో అలంకరించిన దృశ్యం

## లక్షా 58 వేల 500 మొక్కలు

# నాటడమే లక్ష్యం

● నంద్యాల రఘునాథ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, ఆర్మూర్



**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారంలో ఆర్మూర్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో లక్షా 58వేల 500 ఈతమొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ నంద్యాల రఘునాథ్‌రెడ్డి తెలిపారు. రైతులు తమ పంట పొలాల్లో ఈతమొక్కలు నాటుకునేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని, వారు ముందుకువస్తే మొక్కలు అందజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ప్రవేశపెడుతోందని, ఇప్పటి వరకు ఆరు మండలాల్లో 47 మందికి ఉపాధి అవకాశాల కోసం ప్రతిపాదనలు పంపగా, 30 మంది ఆటోలు, గేదెలు, కిరాణా దుకాణాల ద్వారా ఉపాధి పొందుతున్నారని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.**

**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటే ఈతమొక్కల లక్ష్యం ఎంత? ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు? ఏయే ప్రదేశాల్లో నాటుతున్నారు?

**ఎక్సైజ్ సీఐ:** ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో ఎక్సైజ్ శాఖ ద్వారా లక్షా 58వేల 500 మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు లక్షా 53 వేల ఈతమొక్కలు నాటాం. రైతులు పంటపొలాల్లో నాటుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. రైతులు ముందుకువస్తే మొక్కలు అందజేసేందుకు ఎక్సైజ్ శాఖ సిద్ధంగా ఉంది. కాలువలు, చెరువుగట్లు, వ్యవసాయ పంటభూముల్లో ఈతమొక్కలు నాటుతున్నాం. ప్రస్తుతం కాకతీయ కాలువ వెంబడి 18వేలు, ఆర్మూర్‌లో 9వేలు, డిచ్‌పల్లిలో 6వేలు ఈతమొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**ఆంధ్రజ్యోతి:** గుడుంబా తయారీ, విక్రయాలపై ఆధారపడి జీవిస్తున్నవారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు? ప్రభుత్వానికి ఇప్పటివరకు ఏమైనా ప్రతిపాదనలు పంపారా? ఎంతమంది ఉపాధి పొందుతున్నారు?

**ఎక్సైజ్ సీఐ:** గుడుంబా తయారీ, విక్రయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారికి ఆర్థిక సాయం అందించి కొత్త జీవితం ప్రసాదించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 47 మంది లబ్ధిదారులను గుర్తించి ప్రతిపాదనలు పంపాం. ఇప్పటివరకు 30 మందికి గేదెలు, కిరాణ, జనరల్ దుకాణాలు, ఆటోలు పంపిణీ చేయడం జరిగింది.

**ఆంధ్రజ్యోతి:** గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు, బెల్ట్‌షాపుల నియంత్రణ కోసం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? ఏమైనా కేసులు నమోదు చేశారా?

**ఎక్సైజ్ సీఐ:** సాధారణంగా గంజాయి మొక్కలు నవంబరు, డిసెంబరు, జనవరి మాసాల్లో బయటికి వస్తాయి. ఆ సమయాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేస్తాం. గుడుంబా తయారీ, విక్రయాలు, బెల్ట్‌షాపుల నియంత్రణ కోసం దాడులు నిర్వహిస్తున్నాం. బెల్ట్‌షాపులకు సహకరిస్తున్నవారిపై కూడా చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఆర్మూర్ టౌన్‌తోపాటు, చిట్టాపూర్‌లో బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. అదేవిధంగా గ్రామాల్లో కల్తీకల్లు తయారీదారులపై నిఘా పెట్టాం. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు సంపాదిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గుడుంబా తయారీ, విక్రయాలు, బెల్ట్‌షాపుల నియంత్రణ కోసం ప్రత్యేక దృష్టి సారించాం.

**- బాల్కొండ**

# కాలగర్భంలో కచ్చీర్లు

- నాడు పంచాయతీ తీర్పులకు వేదిక
- సమస్య ఏదైనా పరిష్కారం అక్కడే
- సాంస్కృతిక ప్రదర్శనలూ ఇక్కడే
- చిన్నారుల ఆటపాట- పెద్దల కాలక్షేపం
- ఆధునిక కాలంలో కనుమరుగు



వన్నెల్(బీ) గ్రామంలోని కచ్చీరు

**బాల్కొండ:** నాటి గ్రామ సమైక్య జీవనంలో కచ్చీర్లు ఒక భాగం. రచ్చబండ, కచ్చీర్లు ఏ పదంతో పిలిచినా ఒక్కటే పాత తరం గ్రామ పంచాయతీలు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా, పంచాయతీ జరిగినా వీటి వద్దే. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు లేని కాలంలో రాత్రిళ్ల కచ్చీర్ల వద్ద వీధి నాటకాలు, హరికథా పారాయణాలు, ఒగ్గుకథ వంటివి ఇక్కడే జరుగుతుండేవి. గ్రామంలోని వారంతా ఒక్కచోటుకు చేరుకుని వాటిని తిలకించేవారు. నాడు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఈ కచ్చీర్ల వద్దే పరిష్కరించుకునేవారు. ఇప్పుడు గ్రామాల్లో హైటెక్ సొబగులు వీటి రూపురేఖలను మార్చుతున్నాయి. మారుతున్న ఆధునిక సమాజంలో రానురానూ కచ్చీర్లు, గడులే కాక ఎన్నో పురాతన కట్టడాలు, సంస్కృతులు కూడా కనుమరుగవుతున్నాయి. నాటి సంస్కృతులు అక్కడక్కడా ఉన్నా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ రాకముందు రాష్ట్రంలో పోలీస్, పట్వారీ వ్యవస్థ ఉండేది. కచ్చీర్ల వద్దే పోలీస్, పట్వారీలు కూర్చుని పాలన సాగించేవారు.

### సమస్యలకు పరిష్కారాలు అక్కడే..

గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు, భూతగాదాలు వచ్చినా కచ్చీర్ల వద్దే గ్రామ పెద్దలు ఒక్కచోటకు చేరి పరిష్కరించేవారు. నేటి మాదిరిగా ఏ చిన్న సమస్య వచ్చినా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేవారు కాదు. నూటికి 90 శాతం కచ్చీర్ల వద్దే పరిష్కారమయ్యేవి. కానీ నేడు 90 శాతం సమస్యలు పోలీస్ స్టేషన్‌లోనే పరిష్కారమవుతున్నాయి. గ్రామం నడిబొడ్డులో ఉండే కచ్చీర్లు కేవలం పంచాయతీలకు వేదికగానే కాకుండా సాయంత్రం కాలక్షేపానికి ఎంతో ఉపయోగపడేవి. గ్రామంలోని చిన్నారుల ఆటపాటలు అక్కడే సాగేవి. వీధి నాటకాలు, ఒగ్గుకథలు తదితర కాలక్షేపాలకు ఇవి వేదికలుగా ఉండేవి. కాలం మారుతున్న కొద్దీ కచ్చీర్లకు ప్రాధాన్యత తగ్గుతుంది. కొన్ని గ్రామాల్లో తప్పా, మెజార్టీ గ్రామాల్లో అసలు కచ్చీర్లు కనబడే దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఫంక్షన్ హాల్, మీటింగ్ హాల్, పాఠశాల లే వేదికలవుతున్నాయి. పట్వారీ, పోలీస్ వ్యవస్థ ఉన్నంత కాలం కచ్చీర్లు కళకళలాడుతూ ఉండేవి. తెలంగాణలో అప్పటి నైజాం ప్రభుత్వ హయాంలో కచ్చీర్లకు పునాది పడిందని పెద్దలు పేర్కొంటున్నారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు పోలీస్, పట్వారీ వ్యవస్థను రద్దుచేయడంతో కచ్చీర్లకు కాలం చెల్లినట్లయింది.

### నాడు పోలీస్ స్టేషన్ అంటే తెలియదు..



నాడు గ్రామంలో ఏ సమస్య వచ్చినా కచ్చీర్ల వద్దే పరిష్కరించుకునేవారం. అప్పుడు పోలీస్‌స్టేషన్ అంటే తెలియదు. గ్రామం ఒక కుటుంబంలా కలిసి మెలిసి ఉండి, సా యంత్రం అయిందంటే కచ్చీర్ వద్దకు చేరి, సమస్యలపై చర్చించేవారం. ప్రస్తుతం ఏ చిన్న సమస్య వచ్చినా పోలీస్ స్టేషన్‌కు పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**- పార్శపు రాజేశ్వర్ వన్నెల్ (బీ)**

### సమస్య ఏదైనా పరిష్కారం అక్కడే..



అప్పట్లో గ్రామంలో ఏ సమస్య వచ్చినా కచ్చీర్ల వద్దే పరిష్కరించుకునేవాళ్లం. పట్వారీ, పోలీస్ వ్యవస్థ ఉన్నప్పుడు అక్కడే ఉండేవాళ్లం. కాలక్షేపం కోసం పెద్దలంతా ఒక్కచోటుకు చేరి ఊరి ముచ్చట్లు చర్చించేవారు. వీధినాటకాలు, బుర్రకథలకు వేదికగా ఉండేవి. అప్పుడు జనంతో కచ్చీర్ కళకళలాడుతూ ఉండేది.

**- నాగులపల్లి గంగారాం**

# డిటెన్షన్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో టెన్షన్

**లింగంపేట:** ఇప్పటివరకు ఉన్న నాన్ డిటెన్షన్ విధానాన్ని ఉత్తీర్ణత మార్కులతో సంబంధం లేకుండా పై తరగతులకు పంపే విధానాన్ని రద్దుచేస్తూ, డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులను టెన్షన్‌కు గురిచేయనుందని విద్యాభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో ఐదో తరగతి, ఉన్నతస్థాయి విద్యలో ఎనిమిదో తరగతిలో డిటెన్షన్ పద్ధతి ప్రవేశపెడితే, అందులో ఉత్తీర్ణులైతేనే పై తరగతులకు వెళ్లే వీలుంటుంది. కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని 2009 ఆగస్టు 4న రూపొందించింది. దీని ప్రకారం పేద, బడుగు వర్గాల అభివృద్ధిలో భాగంగా 6 నుంచి 14 సంవత్సరాల విద్యార్థులందరికీ విద్య తప్పనిసరి చేసి, ఉచితంగా బోధించేందుకు నిర్ణయించింది. దీంతో ఏప్రిల్ 1, 2010 నుంచి విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చింది.

### అందరికీ విద్య..

సమాజంలోని ప్రతీఒక్కరు చదువుకోవాలని వర్గ, లింగ బేధం లేకుండా విద్యాభివృద్ధి సాధించేందుకు విద్యాహక్కు చట్టం రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి కిలోమీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాలను ఏర్పాటుచేసింది. అందుకు అనువుగా పాఠశాల భవనాలు, ఉపాధ్యాయ నియామకాలతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించింది. ప్రపంచ వ్యాప్తంగా 135 దేశాలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్న నినాదంలో భాగంగా మన దేశం భాగస్వామిగా ఉంటూ విద్యాహక్కు చట్టం అమలుచేస్తూ కీలకంగా నిలిచింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎలాంటి డిటెన్షన్ పద్ధతి లేకుండా హైస్కూల్ స్థాయి వరకు విద్యను ప్రోత్సహించడంతో గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం ఇటీవల కాలంలో మెరుగైంది.

### డిటెన్షన్‌తో విద్యకు దూరం..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాల పెంపులో భాగంగా డిటెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు భావిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధన విధిస్తే విద్యార్థుల్లో ఆసక్తి తగ్గి పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమై, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారనుందని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. డిటెన్షన్ పద్ధతి ప్రస్తుతం లేకపోవడంతో విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా పదో తరగతి పూర్తిచేస్తున్నారు.

### గ్రహణం రోజు

## ఘన పదార్థాలు స్వీకరించొద్దు

**ఆధ్యాత్మికం**

-ఆంజనేయశర్మ

ఈ నెల 7న రాత్రి 10.52 నుంచి 12.49 వరకు చంద్రగ్రహం ఉన్న కారణంగా గ్రహణం రోజున ఘనపదార్థాలను స్వీకరించవద్దు, గ్రహణం నుంచి ఉపశమనం పొందేందుకు జపం, తపస్సుల ద్వారా ఉపశమనం లభిస్తుంది. గ్రహణాన్ని శ్రవణా నక్షత్రం, మకర రాశులకు చెందినవారు చూడకూడదు, మేష, సింహ, వృశ్చిక, మీనరాశుల వారికి శుభప్రదంగా ఉంటుంది. మిగిలిన రాశుల వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. చంద్రగ్రహణం రోజుననే రాఖీ పౌర్ణమి ఉన్నందున యజ్ఞోపవీతం చేసుకునేవారు రాఖీపౌర్ణమి రోజున కాకుండా సెప్టెంబరు 6న భాద్రపద శుద్ధ పౌర్ణమి రోజున యజ్ఞోపవీతం చేసుకోవాలి.

-లింగంపేట

**టీచర్ వాయిస్**

### కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12నెలల వేతనంతోపాటు

## భద్రత కల్పించాలి

● సంతోష్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



గత 17సంవత్సరాలుగా కాంట్రాక్ట్ లెక్చరర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ కళాశాలలే మా ఊపిరిగా పనిచేస్తున్న మాకు ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసే సమయంలో కేసులు అడ్డురావడంతో నిలిచిన రెగ్యులరైజేషన్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేక జీవో ద్వారా ఉద్యోగ భద్రత, 12నెలల వేతనాన్ని అందించి ఆదుకోవాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను పంజాబ్ రాష్ట్రంలో రెగ్యులర్ చేసినట్లు ఇక్కడి ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా కాట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి.

-లింగంపేట

# ఆగిఉన్న లారీని ఢీకొన్న రాజధాని బస్సు

● పలువురు ప్రయాణికులకు గాయాలు..
గాయపడ్డవారిలో ఇద్దరు నగరవాసులు





ప్రమాదంలో ధ్వంసమైన బస్సు.. గాయపడిన ప్రయాణికులు

**నిజామాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రం నుంచి శుక్రవారం రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్ బయలుదేరిన రాజధాని బస్సు డిచ్‌పల్లి మండలం బీబీపూర్ తండా వద్ద 44వ నెంబర్ జాయతీ రహదారిపై రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో హైదరాబాద్ వెళ్తున్న ఎర్రం శ్రీను, ఆసీఫ్, నితిన్‌పాండే, అభిషేక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఎర్రం శ్రీను, ఆసీఫ్‌లు నిజామాబాద్ నగరానికి చెందిన వారు కాగా, నితిన్‌పాండే, అభిషేక్‌లు హైదరాబాద్ వాస్తవ్యులని తెలిసింది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికా ర వర్గాలు తెలిపాయి.

## ‘చెట్ల కిందనే పాఠాలు’పై స్పందించిన సర్కారు



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**నవీపేట:** మండలంలోని పొతంగల్ లోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌లు పరిశీలించారు. శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘చెట్లకిందనే పాఠాలు’ అనే కథనానికి స్పందించిన అధికారులు శుక్రవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో గదుల కొరత ఉందని పలువురు విద్యార్థినులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో సీట్లు పొందినప్పటికీ గదులు లేకపోవడంతో 20 మంది రావడం లేదని తెలుసుకుని వెంటనే వారిని కూడా పాఠశాలకు రప్పించాలని ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ వసంత్‌రావును ఆదేశించారు. అదనపు గదుల నిర్మాణ అవశ్యకత గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ ఎంపీడీవోలు పేర్కొన్నారు. కాగా మధ్యాహ్నం భోజనంలో నాణ్యతగా లేకపోవడం పట్ల అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా పాఠశాల పరిస్థితి గురించి జిల్లా ఎస్సీ గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ తులసిదాస్ ఫోన్‌లో వాకబు చేసినట్లు అధికారులు తెలిపారు.

## టెట్ ఫలితాల విడుదల

**నిజామాబాద్ అర్బన్:** జూలై 23న నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో పేపర్-1 60.69 శాతం ఉత్తీర్ణత నమోదయింది. 3,058 మంది అర్హత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా పేపర్-1 పరీక్షలో 57.37 శాతం ఉత్తీర్ణత నమోదయింది. పేపర్-2 పరీక్షకు జిల్లాలో 8,542 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 17.35 శాతం ఉత్తీర్ణతతో కేవలం 1,482 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా పేపర్-2 లో 19.51 శాతం ఉత్తీర్ణత నమోదైంది.


## వివాహిత మృతి.. భర్తే హత్య చేశాడంటూ ఫిర్యాదు



**ఖిల్లా:** జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వరూప (28) అనే గృహిణి మృతి చెందింది. కాగా భర్తే ఆమె మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. వెంటనే భర్తను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందల్‌వాయి మండలం రూప్లానాయక్ తండాకు చెందిన స్వరూపరె 8 ఏళ్ల క్రితం పోలీసు శాఖలో ఔట్‌సోర్సింగ్‌పై సదాశివనగర్ ఎస్సై వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న రవితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా భార్యను కొంతకాలంగా రవి వేధిస్తున్నాడని బంధువులు తెలిపారు. రవి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని స్వరూపను చిత్రహింసలకు గురి చేశాడని మృతురాలి తల్లి చెప్పారు. రవి తమ బిడ్డను చిత్రహింసులు పెట్టి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడని ఆమె తెలిపారు. చికిత్స పొందుతూ ఆమె చనిపోయిందని మృతురాలి తల్లితో పాటు బంధువులు ఆరోపించారు. శుక్రవారం ఉదయం స్వరూప చని పోయింద్న విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. దీంతో ఆమె బంధువులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. చికిత్స పొందుతూ స్వరూప మృతి చెందడం వెనుక రవి హస్తం ఉందని, రవిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సారొస్తారా..?!

● రుద్రూరులో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల నూతన భవనాన్ని 10న ప్రాంభించేందుకు సన్నాహాలు



ప్రారంభానికి సిద్ధమవుతున్న కళాశాల

**రుద్రూరు:** తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి ఆహార విజ్ఞానశాస్త్ర మరియు సాంకేతిక కళాశాలను 2015లో జిల్లాలోని రుద్రూరు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేశారు. తాత్కాలికంగా పాత భవనాల్లోనే విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. గత ఏడాది నూతన భవనాల నిర్మాణం పనుల కోసం రూ.10 కోట్లు మంజూరు కాగా.. పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన చిన్న చిన్న పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కాగా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఈ ఏకైక కళాశాల నూతన భవనాన్ని ప్రారంభానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తారా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఈ నెల 10న నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకం శంకుస్థాపన కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి రుద్రూరులో కళాశాల భవనాన్ని కూడా ప్రారంభించేందుకు వస్తారా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కళాశాల భవన ప్రారంభానికి కేసీఆర్ వస్తారనే అధికార వర్గాలు అంటున్నాయి. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిస్తే బాగుంటుందని స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.

## 5 నెలల చిన్నారి అనుమానాస్పద మృతి




మృతిచెందిన సవిత

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని తక్కూరివాడలో సవిత అనే 5 నెలల పసిపాప అనుమానాస్పదంగా మృతి చెందిందని ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పాపకు పాలు ఇచ్చి పడుకోబెట్టిన తల్లి సౌజన్య స్నానానికి వెళ్ళిందని వచ్చి చూడగానే పాప మృతిచెందింది. అయితే తన బిడ్డను అత్తా, భర్త గొంతు నమిలి చంపారని సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏడాదిన్నర క్రితం సౌజన్యకు అదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌తో వివాహం జరిగింది. ఆడ పిల్ల పుట్ట డం వల్ల భర్త, అత్త తమను సరిగా చూసు కోలేదని పాప తల్లి సౌజన్య అంటోంది. దీనిపై అత్త, భర్త మాట్లాడుతూ సౌజన్య బాత్రూమ్‌కి వెళ్లినప్పుడు పాప ముక్కు నుండి తెల్ల నురుగు రావడంతో ఆందోళపడి పాపను ఎతుకున్నామని పసి పాపను చంపేంత దుర్మార్గులము కామని వాపోయారు.

## కేసు భయంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**డిచ్‌పల్లి:** మరదలితో ఏర్పరచుకున్న వివాహేతర సంబంధం బెడిసికొట్టింది. రూ.లక్ష జరిమానా కట్టాలని లేకపోతే జైలు కెళ్లడం ఖాయమని కేసుపెట్టిన మరదలి భర్త సాయిలు బెదిరించ డంతో భయపడ్డ ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన గోసంగి ఒడ్డెన్న పురుగుల మందు తాగాడు. ఒడ్డెన్న కొంతకాలంగా తన మరదలు లక్ష్మీతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడు. దీనిపై భార్య ఫిర్యాదు చేయడంతో గ్రామ పెద్దలు ఒడ్డెన్నకు, మరదలికి జరిమానా విధించారు. అయినా ఒడ్డెన్నలో మార్పు రాలేదు. రెండు రోజుల క్రితం మరదలు లక్ష్మి, ఆమె భర్త సాయిలు ఇందల్వాయి పోలీసులకు ఒడ్డెన్నపై ఫిర్యాదు చేశారు. అనంతరం జరిమానా విషయమై బెదిరించడంతో ఒడ్డెన్న ఆత్మహత్యకు యత్నించాడు. ఒడ్డెనను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతి తెలిపారు.

## ●●● ప్రాజెక్టుల సమాచారం ●●●



| | గరిష్ఠ మట్టం (అడుగుల్లో) | ప్రస్తుత మట్టం (అడుగుల్లో) | గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) | నీటి చేరిక (క్యూసెక్కుల్లో) | విడుదల (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 1,091.90 | 1,055.40 | 90.31 | 9.582 | 0 | 500 |
| నిజాంసాగర్ | 1,405.00 | 1,380.30 | 17.5 | 1.352 | 0 | 0 |

## బంగారం ధరలు



| | | |
|---|---|---|
| బిస్కెట్ బంగారం | 10 గ్రాములకు | రూ. 29,800 |
| ఆర్నమెంట్ బంగారం | 10 గ్రాములకు | రూ. 29,400 |
| వెండి | 10 గ్రాములకు | రూ. 415 |

## సినిమా గైడ్ నిజామాబాద్



లలితమహల్ : డీజే - 11.15, 2.15, 6.15, 9.15
అశోక్ : దర్శకుడు 11.15, 2.15,6.15, 9.15
నటరాజ్ : నిన్నుకోరి - 11.15, 2.15, 6.15, 9.15
విజయ్ : ఫిదా - 11.15, 2.15, 6.15, 9.15
శ్రీదేవి : నక్షత్రం - 11.15, 2.15, 6.15, 9.15
దేవి : గౌతమ్‌నంద - 11.15, 2.15, 6.15, 9.15
తిరుమల : జబ్ హరీ మీట్ సెజల్ (హిందీ) - 11.15, 2.15. 6.15, 9.15,

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్
స్ర్కీన్ 1 : నక్షత్రం-10.35,
ఫిదా - 1.35, 4.30, 7.25 10.20
స్ర్కీన్ 2 : దర్శకుడు- 10.50, 4.35
నక్షత్రం - 1.30, 7.30, 10.30
స్ర్కీన్ 3 - జబ్ హరీ మీట్ సెజల్- 10.40, 4.20, 10.10 ,
గౌతమ్ నందా- 1.20, 07.15

- నిజామాబాద్ అర్బన్

## హలో..హలో..

### ఆర్మూర్ పట్టణ అధికారుల ఫోన్ నెంబర్లు

| | | | | | |
|---|---|---|---|---|---|
| కమిషనర్ | 9849904276 | ఆర్వో | 9849981964 | ఏసీపీ | 9440795404 |
| మేనేజర్ | 9849981643 | టీపీబీవో | 9849370736 | ఎస్‌హెచ్‌వో | 9440795411 |
| డీవైఈఈ | 9849371147 | ఏటీవో | 8099867771 | ఎస్సై | 9440795434 |
| ఎంఏఈ | 9849981642 | ఎస్‌టీవో | 9866809387 | ఎంపీడీవో | 9849900107 |
| టీపీవో | 9849981642 | సబ్ రిజిస్ట్రార్ | 9849031470 | ఎంఈవో | 9440899033 |

## ఇంటర్వ్యూ

### భూ సర్వే కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



సూర్యప్రకాష్, సర్వేయర్, ఆర్మూర్

**ఆంధ్రజ్యోతి:** భూ కొలతల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?

**అధికారి:** భూమి సర్వే కోసం మీ సేవలో ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి.

**ఆంధ్రజ్యోతి:** దరఖాస్తు చేసుకొన్న ఎన్ని రోజులలో సర్వే చేస్తారు ?

**అధికారి:** సీరియల్ ప్రకారం దరఖాస్తు చేసుకొన్న వారి సర్వే చేస్తాం. సుమారు 45 రోజుల లోపు సర్వే చేస్తాం.

**ఆంధ్రజ్యోతి:** భూమి కొలతలకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

**అధికారి:** భూమి కొలతలకు దరఖాస్తుదారుని పక్కా భూమి పట్టేదారులకు నోటీసులు పంపుతాం. అందరి సమక్షంలో కొలతలు కొలుస్తాం.

**ఆంధ్రజ్యోతి:**కొలతలలో తేడా కనిపిస్తే ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి ?

**అధికారి:**కొలతలలో అనుమానాలు ఉంటే ఆర్డీవోకు అక్కడ కొలతలలో తేడా వస్తే జిల్లా కేంద్రంలోని ఏడీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

**ఆంధ్రజ్యోతి:** ఆర్డీవోకు, ఏడీకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?

**అధికారి:** ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలంటే 300 రూపాయలు, ఏడీకు 400 రూపాయాలు బాంక్‌లో డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

-ఆర్మూర్‌అర్బన్

## లెన్స్ స్టోరీ

### కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



హౌసింగ్‌బోర్డు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందని ఆ కాలని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేకా డివిజన్‌లో చాలచోట్ల కంచె లేకపోవడంతో మూగజీవులు చనిపోతున్నాయి. ఇన్ని ప్రమాదాలు జరిగిన విద్యుత్ అధికారులు స్పందిచకపోవడం చాల విచారకరం ఇకనైనా ప్రమాదం జరుగకముందే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె ఏర్పాటు చేసి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

-ఆర్మూర్ అర్బన్

# నాలుగో వార్డులో పడకేసిన పారిశుధ్యం

- కంకర తేలిన, గుంతలమయమైన రోడ్లు
- అస్తవ్యస్తమైన డ్రైనేజీతో గుంతల్లో నిలిచిన నీరు
- పట్టించుకోని అధికారులు



మహాలక్ష్మీ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ



కంకర తేలిన రోడ్డు



జర్నలిస్టు కాలనీలో ఇదీ డ్రైనేజీ దుస్థితి

**ఆర్మూర్ అర్బన్:** డ్రైనేజీలు నిర్మించక పోవడంతో ఆర్మూర్ పట్టణంలోని నాలుగోవార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలని పరిధిలో మహాలక్ష్మీ కాలనీ, జర్నలిస్టు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, విద్యానగర్ కాలనీలు ఈ వార్డు పరిధిలోకి వస్తాయి. ఈ వార్డు పరిధిలో బస్టాండ్ ప్రాంగణం , బస్సు డిపో, ఆసుపత్రులు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. సుమారు ఐదు వేల మంది 2178 మంది ఓటర్లు ఉన్నారు. ఈ కాలనీకి ట్యాక్స్ పరంగా మున్సిపల్‌కు అధిక ఆదాయం వస్తుంది. బస్టాండ్ ఎదుట నుంచి వచ్చే డ్రైనేజీ సక్రమంగా నిర్మించకపోవడంతో మురుగు నీరు పారుతుంది. ఈ కాలనీతో పాటు విద్యానగర్ , జర్నలిస్టు , ఎన్టీఆర్ కాలనీలలో అక్కడక్కడ డ్రైనేజీలు మురుగు కాలువలు అక్కడక్కడ నిర్మించక పోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ఆయా కాలనీలోని ప్రజలు రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఎనిమిది బోర్లు ఉండగా ఇందులో నాలుగు బోర్లు పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాలలో రోడ్లు వేసినప్పటికి కంకర తేలి గుంతల మయంగా మారాయి. వెంటనే అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని, గుంతలమయమైన రోడ్లను పూడ్చివేయాలని కాలని ప్రజలు కోరుతున్నారు.

### డ్రైనేజీలు నిర్మించాలి..



పట్టణంలోని నాల్గో వార్డు పరిధిలో మురుగు కాలువలు నిర్మించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నిలిచిన మురుగు నీటితో దుర్గంధం వ్యాపిస్తోంది. వెంటనే పాలకులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలి.

- సఫియా బేగం, కాలనీవాసి, ఆర్మూర్

### రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి..



జర్నలిస్టు కాలనీ పరిధిలో మురుగు కాలువలతో పాటు రోడ్డు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారాయి. వెంటనే పాలకులు రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాలి.

- సాయమ్మ, కాలనీవాసి, ఆర్మూర్

## ఎంఆర్ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**ఆర్మూర్ రూరల్ :** ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోని జెంటిల్‌కిడ్ పాఠశాలలో శుక్రవారం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ పై విద్యార్దుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ నెల 17వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఎంఆర్‌వ్యాక్సిన్ వేస్తారని తొమ్మిది నెలల వయస్సు నుంచి 15 సంవత్సరాల పిల్లలకు తప్పక వేయించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో నాగరాజు, శంకర్, అకుల శ్యామల, శిరీష, ప్రిన్సిపాల్ గంగాప్రకాష్, ఉన్నారు.

## నలంద పాఠశాలలో ఒలంపియాడ్ పరీక్ష

**ఆర్మూర్ రూరల్ :** ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోని నలంద పాఠశాలలో శుక్రవారం క్రియేటివ్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిజిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని జిల్లా ఇన్‌చార్జి బిరుదు రాజు, పృథ్వీరాజ్ తెలిపారు. ఆగస్టు 27న మాథ్సన ఒలింపియాడ్ సెప్టెంబర్ 13న సైన్స్ ఒలంపియాడ్ నిర్వహిస్తారని పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ , ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు.

# డివిజన్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీవ్రత పూజలో పాల్గొన్న మహిళలు

**ఆర్మూర్‌అర్బన్:** ఆర్మూర్ పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 250మంది మహిళలు పారాయణం, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముక్క విజయలక్ష్మీ, బోంపెల్లి సుజాత, తమ్మి అనంతలక్ష్మీ, ముక్క రాధకిషన్, తమ్మి శ్రీనివాస్, పోలసుధాకర్ అశోక్, రాములు, మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### నందిపేటలో..

**నందిపేట:** మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో భాగంగా ఆమె చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని శుచిగా, నిండు మనస్సుతో కోలిచారు. వ్రతం అనంతరం ముత్తైదువులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

### భీమ్‌గల్‌లో..

**బీమ్‌గల్ :** భీమ్‌గల్ మండలంలోని శ్రీసరస్వతి విద్యామందిర్‌లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం మహోత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల సమావేశం గదిలో ప్రత్యేకంగా అలంకరించిన పీఠంపై అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆచార్యులు సుధీర్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో హాజరయిన మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట కుంకుమార్చణ, వాయినాలు, ఇచ్చుకోవడం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ రిటైర్డ్ డిఎం అండ్‌హెచ్‌వో బసంత్‌రెడ్డ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి అష్టశ్వర్యాలు , ఆయురారోగ్యాలతో వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు నర్సారెడ్డి, కమిటీ సభ్యులు , విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నందిపేటలో వరలక్ష్మీ వ్రతం పూజలు



భీమ్‌గల్‌లో..

## రసాయనిక మందుల వాడడంలో మెలకువలను వివరించిన విద్యార్థులు



మందులు కలిపే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థులు

**ఆర్మూర్ రూరల్ :** ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో శుక్రవారం రసాయన ఎరువుల వాడకంలో పాలించాల్సిన జాగ్రత్తలను పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివరించారు. రసాయనిక ఎరువులు కలిపే విధానాన్ని రైతులకు వివరించారు. అవసరాన్ని బట్టి తగిన స్ప్రేయర్లు నాజిల్స్‌ను ఎన్నుకోవాలి. పురుగు మందును పిచికారి చేయడానికి ప్లాట్ ఫాన్ నాజీల్ లేదా హాలోకొన్ నాజీల్ వాడటం మంచిదన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నప్పుడు , గాలివేగం ఎక్కువ ఉన్న సమయాల్లో మంచు కమ్మినప్పుడు వర్షం పడే సూచనలు ఉన్న పరిస్థితుల్లో పంటలపై మందులను పిచికారి చేయవద్దని సూచించారు. విచక్షణ రహితంగా రసాయన మందులను వాడడం వల్ల చీడపీడలు నిరోధక శక్తి పెంచుకోవడమే కాకుండా నేల, వాతావరణం కలుషితమై నేల ఉత్పాదక శక్తి పోతుందని, రసాయనిక మందుల వాడకంలో తగిన మెలకువలు పాటిస్తే రైతులకు ప్రయోజనకరంగా వుంటుందని రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు సాయికృష్ణ, సందీప్, అల్మాస్, భీమ్‌రావ్, నాగరాజు, మహేష్, రైతులు పాల్గొన్నారు.

**హలో..హలో..** నందిపేట్ మండల అధికారుల ఫోన్ నెంబర్లు

| | | | | | |
|---|---|---|---|---|---|
| తహసీల్దార్ | 9491036913 | వైద్యాధికారి | 8897969543 | ఎస్ఐ | 9440795436 |
| ఎంపీడీవో | 9989050838 | పశువైద్యాధికారి | 9491377744 | హౌసింగ్ ఏఈఈ | 7799722949 |
| ట్రాన్స్‌కో ఏడీఏ | 9440811622 | ట్రాన్స్‌కోఏఈఈ | 9440811621 | డిప్యూటీ తహసీల్దార్ | 984842003 |
| ఎంఈవో | 9949966300 | ట్రాన్స్‌కోఏఈఈ నూత్‌పల్లి | 9440811622 | మండల వ్యవసాయాధికారి | 8886613133 |
| ఆర్‌డబ్ల్యూఎస్ఏఈఈ | 9959558287 | | | | |

# రెండో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష

**ఆర్మూర్ అర్బన్ :** ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు తెడ్డు రవికిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోతె దేవన్న, వాగ్మారేబాబు, సాయన్న, శ్యాం, ముత్తెన్న, భూమన్న, గంగారాం, బాజన్న, దీక్షలో కూర్చున్నారు. వీరికి ఎంఎస్ఎఫ్ నాయకులు సంకెపల్లి విప్లవ్, విక్రం, అనిల్, సునిల్, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షుడు తెడ్డు రవికిరణ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే వర్గీకరణ బిల్లు ఆమోదిస్తామని ప్రకటించినప్పటికి వర్గీకరణ బిల్లును తాత్సర్యం చేస్తోందని విమర్శించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఢిల్లీలో, హైద్రబాద్‌లో నిర్వహించిన సభకు హాజరైన కేంద్ర మంత్రులు బీజేపీ వర్గీకరణ చట్టబద్దతకు కేంద్రం అనుకూలంగా ఉందని ప్రకటించారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం వెంటనే స్పందించి వర్గీకరణ బిల్లు ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

### ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

**ఆర్మూర్ అర్బన్ :** వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సంకెపల్లి విప్లవ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో వర్గీకరణ బిల్లును ఆమోదిస్తామని ప్రకటించిన బీజేపీ వర్గీకరణ చేయకుండా జాప్యం చేయడం సరైంది కాదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నైతిక భాద్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాం, విక్రం, అనిల్, సునిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

### గొట్టుముక్కలలో జెండా ఆవిష్కరణ

**మాక్లూర్ :** 1 యూనియన్, 1 ఇండస్ట్రీలో భాగంగా విద్యుత్ కార్మిక సంఘాల రాష్ట్ర ఎన్నికల దృశ్యా శుక్రవారం మండలంలోని గొట్టు ముక్కల గ్రామంలో సెక్షన్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునందన్, కార్యదర్శి లక్ష్మన్‌రెడ్డి, సభ్యులు రాజు, సాయన్న, రాజేంధర్, పోశెట్టి, భోజన్న, ప్రవీన్, గంగాధర్, మోహన్ పాల్గొన్నారు.

### 'సీఎం సభకు భారీగా జన సమీకరణ చేయాలి'

**వేల్పూర్ :** ఈ నెల 10న ఎస్సారెస్పీలో జరిగే సీఎం కేసీఆర్ సభకు మండలం నుంచి భారీగా జనసమీకరణ చేయాలని టీఆర్ ఎస్ మండల పార్టీ సమావేశంలో తీర్మాణించారు. మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మిట్టపల్లి మహిపాల్ అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు రివర్స్ పంపింగ్ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ రానున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో సమీకరించాలని సూచించారు. రివర్స్ పంపింగ్ వల్ల వేల్పూర్ మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన 6530 ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉందన్నారు. దీంతో రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంద న్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లింబాగౌడ్, రాజగౌడ్,శ్రీనివాస్, నవీన్, పెద్ద ఇస్తారి, పార్టీ నీయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'సబ్సిడీ గొర్రెల పథకం అమలుతో గొల్ల కుర్మల అభివృద్ధి'

**కమ్మర్‌పల్లి:** పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు పరుస్తున్న సబ్సిడి గొర్రెల పథకం అమలుతో గొల్ల కురుమ కులస్తులు అభివృద్ధి ఫలాలు అందుకోనున్నారని కమ్మర్‌పల్లి ఎంపీపీ మలావత్ కౌసల్యప్రకాష్, జడ్పీటీసీ దాసరిలక్ష్మీభాస్కర్ యాదవ్ అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ చెప్పాల రజితగంగారాజం, ఎంపీటీసీ రాధరాజాగౌడ్,లక్ష్మీనారాయాణ, గంగారెడ్డి, జలంధర్, పురుశోత్తం, బక్కూరి గోపి, మహేందర్, హల్దెశ్రీనివాస్ టీర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నందిపేటలో ఔదార్యాన్ని చాటిన డాక్టర్లు

**నందిపేట:** పేరుకు ప్రైవేట్ డాక్టరైనా పేద రోగి పట్ల ఉదారాన్ని చాటారు. మాకు మానవత్వం ఉందని నిరూపించారు. పెద్ద మొత్తంలో చెల్లించుకోలేని ఆ పేద రోగి కడుపులో నుంచి ఆపరేషన్ ద్వారా పెద్ద కణతితే తొలగించారు. రోగి నయం అయ్యే వరకు బాగోగులు చూసుకుంటామని హామీ ఇచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళితే..మాక్లూర్ మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన దూడ భోజమ్మ అనే మహిళ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులలో చూయించుకుంది. ఎంతకు నయం కాకపోవడంతో అన్ని రకాల పరీక్షలు చేశారు. కపుడు కణతి ఉందని తీయడానికి 50 నుంచి రూ.60వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. కాని కూలీ నాలి చేసుకొని పొట్ట గడుపుకొనే భోజమ్మ అంత పెద్ద మొత్తం ఖర్చుచేసి ఆపరేషన్ చేయించుకునే పరిస్థితతిలో లేదు. దీంతో స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ ఎస్కె ఫరీద్ ద్వారా నందిపేట మండలంలోని జీకే ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. దీంతో రోగి పేదరికాని చలించిన డాక్టర్లు శుక్రవారం ఆమె కడుపులో నుంచి సుమారు 4 కిలోల బరువున్న కణతిని తొలగించారు. రోగి ఆపరేషన్‌కు సహకరించిందని, ఆమె ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ నారాయణ, అనాస్తిషియా డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీగౌరి, సిబ్బంది ఉన్నారు.



కోలుకుంటున్న బాధితురాలు, (ఇన్‌సెట్‌లో) కంతి

## నందిపేట 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

- మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వినియోగదారులకు తప్పని ఇబ్బందులు

**నందిపేట:** మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఎల్‌వి-1 (టీటీఆర్) లింబులు ఫేయిల్ కావడంతో దాని పరిధిలోని గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన ట్రాన్స్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఫేయిల్ అయిన ఎల్‌వి-1 లింబులను మూడు గంటల పాటు సిబ్బంది శ్రమించి భిగించారు. దీంతో సుమారు 3 గంటల పాటు నందిపేట పట్టణ కేంద్రంతో పాటు చింరాజ్‌పల్లి, యిలాపూర్(వ్యవసాయ) తదితర గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కోన్నారు. ఉక్కపోత బరించలేక ప్రక్క గ్రామాలకు పరుగు పెట్టారు. అసలే వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు కరెంట్ సరఫరా నిలిపివేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోయిన కరెంట్‌ను తిరిగి సరఫరా చేయాలని రైతులు కోరారు. ఈ మరమ్మతులలో లైన్ ఇన్‌స్పెక్టర్ కాంతయ్య, లైన్‌మెన్ రాము, సిబ్బంది నవీన్, గంగాధర్ ఉన్నారు.



మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

## పదవీ విరమణ చేసిన ఎన్ఎస్ఎన్ఐఎస్ హాకీ కోచ్‌కు సన్మానం

**ఆర్మూర్ రూరల్ :** గత నెలలో పదవీ విరమణ చేసిన ఎన్ఎస్ఎన్ఐఎస్ హాకీ కోచ్ టి. హర్షవర్దన్ రెడ్డిని శుక్రవారం ఆర్మూర్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా హకి సంఘం బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఆర్మూర్‌కు చెందిన హర్షవర్ధన్ రెడ్డి 1979 సంవత్సరంలో బీదర్‌లో ఎన్ఎస్ఎన్ఐఎస్ హకీకోచ్‌గా నియమితులయ్యి జులై 31 బెంగుళూర్‌లో పదవీ విరమణ చేశారు. హకీ క్రీడకు ఎనలేని సేవలు చేశారు. హకీలో ఆర్మూర్‌కు గుర్తింపు రావడంలో ఈయన కృషి ఎంతగానో ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా హకీ సంఘం బాధ్యులు డి. హన్మంత్, జీవీ నర్సింహరెడ్డి, కార్యదర్శి సదామస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్; సీనియర్ క్రీడాకారులు అంబల్ల తిరుపతి, గోపాల్, రవి, రాజు, జిమ్మి రవి, క్రీడాకారిణిలు రాణి, స్వరూప, పీఈటీలు సంతోస్ ఠాకూర్ చిన్నయ్య, రాహుల్, శ్రీనివాస్, ముఖిమద్ పాల్గొన్నారు.

### ఎట్టకేలకు మరమ్మతులు

**నందిపేట:** మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జోర్‌పూర్ గ్రామ శివారులో ఉన్న వాగు వద్ద తారు రోడ్డులు ఆర్ అండ్ బీ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో భారీ వర్షాలకు నందిపేట-జోర్‌పూర్ తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు కోతకు గురై వరధ నీరు ప్రవహించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేక మార్లు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు స్పందించారు. శుక్రవారం ఆర్అండ్‌బీ ఏఈ కొండయ్య రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దగ్గరుండి పెద్ద గుంతలను పూడ్చివేయించారు. త్వరలోనే దానిపై తారువేయాలని ప్రయాణికులు ఏఈని కోరారు.

### ఈశ్వరీయ బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో రక్షాబంధన్

**ఆర్మూర్‌అర్బన్:** ఆర్మూర్ పట్టణంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వేడుకలలో భాగంగా పట్టణంలోని దుకాణాలలో, కార్యాలయాలలో తిరుగుతూ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సంతోస్ కుమార్‌కు, పోలీస్ సిబ్బంది మల్లేష్, నాగనాథులకు, బ్రహ్మకుమారీ దీప రాఖీకట్టి స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సుంకె శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మచ్చర్లలో గ్రామ దేవతలకు జలాభిషేకం

**ఆర్మూర్ రూరల్ :** వర్షాలు సమృద్ధిగా కురిసి , పంటలు పండాలని ప్రార్థిస్తూ శుక్రవారం ఆర్మూర్ మండలం మచ్చర్ల గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గంగా జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లెల గంగారాం, వీడీసీ చైర్మన్ గొల్ల నర్సయ్య, కోశాధికారి బక్కన్న మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఈజీఎస్ కూలీలచే మొక్కలకు నీటి సరఫరా

**ఆర్మూర్ రూరల్:** తెలంగాణ హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొక్కలు నాటిన నుంచి వర్షాలు లేకపోవడంతో వాటిని కాపాడుకోవడానికి అధికారులు తంటాలు పడాల్సి వస్తోంది. ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామ శివారులో నాటిన మొక్కలను ఎంపీడీవో లింగయ్య శుక్రవారం పరిశీలించారు. మిగతా మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని ఎంపీడీవో లింగయ్య అన్నారు.

### 'కేలేగా భరత్‌ను విజయవంతం చేయాలి'

**ఆర్మూర్ అర్బన్ :** పండిత్ దీన్‌దయాల్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని మినిస్టేడియంలో బుధ, గురు వారాలలో నిర్వహించనున్న కేలేగా భారత్, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం వేణు అన్నారు. ఆర్మూర్‌లోని నరేంద్ర, విజేత , విజయ్, సక్సెస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం కలేగా భరత్ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో గెలుపొందిన వారికి రాష్ట్ర , జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.


### మీజిల్స్,రూబెల్లా వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

**మాక్లూర్:**మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం ప్రాణాంతకమైన మీజిల్స్, రూబెల్లా వ్యాధులపై వైద్యాధికారి డాక్టర్ సంజీవరెడ్డి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకమైన మీజిల్స్, రూబెల్లా 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు గల పిల్లలు తప్పక తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో, కమ్యూనిటీహాల్ పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది టీకాలు వేస్తారన్నారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రగతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'జీఎస్టీ' పేర నిరుపేదలను దోస్తున్న కేంద్ర ప్రభుత్వం

**కమ్మర్‌పల్లి:** పేద ప్రజానీకంపై పెను భారం మోపేవిధంగా జీఎస్టీ పేర పేదోళ్లను దోస్తూ పెద్దోళ్లకు పంచేవిధంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని అఖిలభారత రైతు కూలీ సంఘం ( ఏఐకేఎమ్మెస్ )ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు సారా సురేష్ విమర్శించారు. గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ ఎత్తివేతను నిరసిస్తూ శుక్రవారం కమ్మర్‌పల్లిలో తహసీల్ కార్యాలయం ముందు ఏఐకేఎమ్మెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈనంతరం తహసీల్దార్ అర్చనకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎమ్మెస్ నాయకులు జి కిషన్, టి కిషన్, బి భూమేశ్వర్, పీవోడబ్ల్యూ నాయకురాలు సత్తెమ్మ, సారా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## దారి కనుక్కోండి



## సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు..
కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

## టంగ్ ట్విస్టర్స్

1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall

# ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే.. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!





పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

### సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



### మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

## రంగులు వేయండి



## నవ్వుల్ నవ్వుల్



**తండ్రి :** ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
**బన్ను :** నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
**తండ్రి :** !!!!!!!!

=======

**టీచర్ :** టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
**చిన్ను :** అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

## చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను
తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను
రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

## జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. హాఆరం ▸ ..................
2. ధుమరం ▸ ..................
3. చాతిమం ▸ ..................

## జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ..................
2. FODO ▸ ..................
3. RPEO ▸ ..................

## చుక్కలు కలపండి



## బొమ్మ గీయండి




## మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.

## ఔనా!


స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

## జవాబులు

చెప్పగలరా? : కూతురు
జంతర్‌మంతర్ : 1. ఆహారం 2. మధురం 3. చామంతి
జంబ్లింగ్ వర్డ్స్ : 1.SIDE 2.FOOD 3.ROPE

# 60 రోజుల్లో 60 టీఎంసీలు

- శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం
- గోదావరి నీళ్లు రివర్స్ పంపింగ్
- ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



రివర్స్ పంపింగ్ మ్యాప్

**ఆర్మూర్:** ఒకవైపు పూడిక ముప్పు, మరోవైపు గోదా వరిలో నీటి లభ్యత తగ్గి భవిష్యత్ ప్రశ్నార్థకమవుతున్న సమయంలో రివర్స్ పంపింగ్ శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవంగా కనిపిస్తోంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిండక సాగు నీటి ఇబ్బంది లెదురవుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నీళ్లు కిందనుంచి పైకి తీసుకరావాలని నిర్ణయించింది. రూ. 1061 కోట్లు మంజూరు చేసి, టెండర్లు కూడా ఖరారు చేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గోదావరికి అడ్డంగా నిర్మించారు. పై నుంచి నీరు ప్రాజెక్టులోకి చేరేది. రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం సఫలమైతే కింద నుంచి కూడా ప్రాజెక్టులోకి నీరు రానుంది. ప్రాజెక్టుకు కింద సుమారు వందల కిలో మీటర్ల దూరంలో గోదావరి నీళ్లు ఎత్తి పోతల ద్వార శ్రీరాంసాగర్ లోకి మళ్లించే ప్రయత్నం చేస్తోంది. మొత్తం ఏడు ఎత్తిపోతల ద్వార నీరు పైకి మళ్లిస్తారు. సుమారు 100 కిలో మీటర్లు వరద కాలువనే వినియోగించనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ఎత్తిపోతల పథకాలు నిర్మించి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి మళ్లిస్తారు. ఎల్లంపల్లి నుంచి 102 కిలో మీటర్ల వద్ద (నందిమేడారం) వరద కాలువలో కలుపుతారు. ఇక్కడి నుంచి పైకి శ్రీరాంసాగర్‌కు మళ్లిస్తారు. పైకి శ్రీరాంసాగర్‌లో కి నీరు మళ్లించడానికి మూడు ఎత్తిపోతలు నిర్మిస్తారు. ఈ నీరు వస్తే ఆయకట్టును ఎంతో ఆదుకున్నట్లవుతుంది.

### మహారాష్ట్ర వరదల పైనే ఆధారం..

ప్రస్తుతం మహారాష్ట్ర వరదలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మహారాష్ట్రలో వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రస్తుతం తెలంగాణతో పా టు మహారాష్ట్ర లోనూ వర్షాభావం ఏర్పడింది. అంతేగాక మహారాష్ట్రలో చిన్నా, పెద్దా ప్రాజెక్టులు సుమారు 12 ని ండాలి. జైక్వాడ్ ప్రాజెక్టు శ్రీరాంసాగర్ కంటే పెద్దది. 102 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 60 టీఎంసీల నీరుంది. ఈ ప్రాజెక్టు నిండిన తర్వాత కిం దనున్న ప్రాజెక్టులు నిండుతాయి. 2013 లో తెలంగాణలో వర్షాలు అంతగా కురువకున్నా , మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో నిండిపోయింది.

### తగ్గిన నీటి లభ్యత...

గోదావరిలో ఎగువన నీటి లభ్యత బాగా తగ్గింది. 20 ఏళ్లలో 196 టీఎంసీలకు పడిపోయింది. గోదావరి నీటి లభ్యత 196 టీఎంసీలుంటే ప్రాజెక్టులోకి వచ్చేనీరు చాలా తక్కువగా ఉంది. 2015-16 లో కేవలం రెండు టీఎంసీలు మాత్రమే వచ్చింది. ప్రాజెక్టు చరిత్రలో ఇదే అతితక్కువ ఇన్‌ఫ్లో కావడం విశేషం. ఈయేడు కూడా ఇప్పటి వరకు ఆశించిన ఇన్‌ఫ్లో రాలేదు. ఇప్పటి వరకు కేవలం 1.162 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. ఆగస్టు, సెప్టెంబర్ లో నీరు వస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. గతంలో ఆ గస్టు, సెప్టెంబర్ లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి నీరు వచ్చిన సందర్భాలున్నాయి.

### ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..

పునరుజ్జీవం పథకం రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఈ పథకం పూర్తయితే రోజుకో టీఎంసీ చొప్పున 60 రోజులలో 60 టీఎంసీల నీరు వస్తోంది. ఈ నీరు నిజామాబాద్ జిల్లాతో పాటు, లోయర్ మానేరు నుంచి శ్రీరాంసాగర్ వరకు ఉన్న ఆయకట్టుకు సరిపోతుంది. లోయర్ మానేరు నుంచి కిందకు ఎస్సారెస్పీ నుంచి నీరు ఇవ్వాల్సిన అవసరముండదు. ఎల్లంపల్లి నుంచి లోయర్ మానేరుకు కాళేశ్వరం నీళ్లు అందిస్తారు. ఈ నీటిని లోయర్ మానేరు కింద అందిస్తారు. కాళేశ్వరం వద్ద నీరు పుష్కలంగా ఉంది. శ్రీరాం సాగర్‌లోకి ఇప్పటి వరకు ఒక్క టీఎంసీ వస్తే కాళేశ్వరం వద్ద 210 టీఎంసీల నీరు కిందకు వెళ్లింది. ఏడు ఎత్తిపోతల పథకాలు విజయవంతంగా నడిస్తే శ్రీరాంసాగర్ జలకళను సంతరించుకోనుంది.

### 10న సీఎంచే శంకుస్థాపన...

శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 10న శంకుస్థాపన చేయనున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వద్దనే శిలాఫలకం ఆవిష్కరిస్తారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను మిషన్ భగీరథ వైస్ చై ర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. కాళేశ్వరం ఎతి పోతల పథకంలో ప్రశాంత్‌రెడ్డి క్రియాశీలంగా ఉన్నారు.

### బాల్కొండలో లక్షా 23 వేల ఎకరాలకు నీరు..

ఈ ప్రాజెక్టు వల్ల బాల్కొండ నియోజకవర్గంలో లక్ష 32 వేల ఎకరాలకు సాగు నీరందనుంది. ఇందులో 90 వేల ఎకరాల కొత్త ఆయకట్టు కాకతీయ కాలువకింద 12 వేలు, లక్ష్మీ కాలువకింద 18 వేలు, చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల కింద 12 వేల ఎకరాలకు నీరందుతుంది. కొత్తగా 90 వేల ఎకరాలు స్థిరికరించనున్నారు. వరద కాలువ, కాకతీయ కాలువ మధ్యలో కొత్తగా 20 వేల ఎకరాలకు నీరందుతుంది. ప్రాణహిత చేవెళ్ల 20వ ప్యాకేజీ కింద 70 వేల ఎకరాలకు ఏడు టీఎంసీల నీరు కేటాయించను న్నారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఏడు టిఎంసిలు కేటాయించారు. నిజామాబాద్ రూరల్‌లో లక్షా 20 వేల ఎకరాలకు, కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాలలో లక్ష ఎకరాలకు నీరందిస్తారు.

## గొర్రెల యూనిట్‌ల పంపిణీలో అక్రమాలకు తావులేదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యోగితారాణా

**నిజామాబాద్ అర్బన్:** గొర్రెల పంపిణీలో అక్రమాలకు తావులేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితారాణా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన గొర్రెల రీసైక్లింగ్‌పై ఆమె స్పందించారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెలన్నింటిని ఒక్కటే రోజులో తనిఖీ చేస్తామన్నారు. వాహనాల నుంచి పంపిణీ వరకు అనుమతి తప్పనిసరి చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే వదిలిపెట్టమని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి అర్హులైన గొల్ల, కుర్మల సహకార సంఘాల్లో సభ్యులైన ప్రతీ అర్హులకు గొర్రెలు ఇస్తున్నామన్నారు. మొదటి విడతలో జిల్లాలో 9631 యూనిట్‌లు లక్ష్యం కాగా, ఇప్పటికీ 2670 యూనిట్‌లు గ్రౌండింగ్ అయినట్లు కలెక్టర్ తెలిపారు. 27.72 శాతం పంపిణీలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని గ్రౌండింగ్‌లో రెండో స్థానంలో ఉందన్నారు. ఇతర జిల్లాలలో గొర్రెలను అ మ్మడం, కొనడం జరిగిందని కానీ మన జిల్లాలో అలాంటి సంఘటనలు జరగలేవన్నారు. గొర్రెల యూనిట్‌ల విషయంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏడాది పాటు యూనిట్‌లను అమ్మవద్దని ఆమె అన్నారు. ప్రతి గొర్రెకు ఇన్సూరెన్స్ చేశామని, గొర్రెలు కొన్న వెంటనే ఇన్సూరెన్స్ అమల్లోకి వస్తుందన్నారు. గొర్రెలను తీసుకువచ్చేటప్పుడు ప్రమాదాలు జరిగిన, ఒకవేళ గొర్రెలు మరణించిన వాటికి సంబంధించిన పూర్తి డబ్బులు తిరిగివస్తాయన్నారు. గ్రామాల్లో వీఆర్‌వో, వీఆర్‌ఏలు నోడల్ అధికారులుగా గొర్రెల యూనిట్‌లపై నియమించామన్నారు. ఎవరైనా గొర్రెలను అమ్మితే టోల్‌ఫ్రీ నెంబర్‌కు, గ్రామాల్లో నోడల్ అధి కారులకు సమాచారం అందించాలన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా గ్రౌండింగ్ అయిన 2670 యూనిట్‌లకు ఒకేసారి సర్వే చేశామన్నారు. తహశీల్దార్, పశుసంవర్థక శాఖ సి బ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు ప్రతి యూనిట్‌ను సర్వే చేసి సాయంత్రంలోగా రిపోర్ట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెల పంపిణీపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకోసారి గొర్రెల యూనిట్‌లపై సర్వే చేయడం జరుగుతుందన్నారు. గొర్రెలను ఇతర జిల్లాలకు తరలించాలంటే తప్పనిసరిగా ఆర్‌టీఏ అనుమతి తీసుకోవాలన్నారు. ఎక్కడ రీసైక్లింగ్ జ రగడం లేదని ఇతర జిల్లాలకు గొర్రెల పంపిణీని నియంత్రిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జేసీ రవీందర్‌రెడ్డి, డీఎఫ్‌వో ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ వెంకటేశం, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకట్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గొర్రెల రీ సైక్లింగ్‌పై సీఎం ఆదేశాలు

**(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)**

గొర్రెల పంపిణీలో జరుగుతున్న గోల్‌మాల్‌పై సీఎం కేసీఆర్ స్పందించారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన గొర్రెల రీసైక్లింగ్‌పై దర్యాప్తు చేయాలని అన్ని జిల్లాల కలెక్ట ర్లను ఆదేశించారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడా లని సీఎంవో నుంచి జిల్లా కలెక్టర్లకు సమాచారం శుక్రవారం అందింది. ఈ సమాచారంపై వెంటనే కలెక్టర్ స్పందించారు. అన్ని మండలాల అధికారులతో మాట్లా డారు. ప్రతి మండలంలో లబ్ధిదారులకు పంపిణీ జరిగిన గొర్రెలను పరిశీలించాలని ఆదేశించారు. అనంతపూర్ నుంచి వచ్చిన గొర్రెలు ఉన్నాయా, లేవా పరి శీలించాలని కోరారు. గొర్రెలు ఇతరుల చేతులకు వెళ్లి పోతే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. లబ్ధిదారులు ఇతరులకు అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు తెలిపారు. ఏపీ నుంచి కాక జిల్లాలోకానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలోకానీ కొనుగోలు చేస్తే ఆ అధికారులపైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెలు నిబంధనల ప్రకారం ఉన్నాయా, లేదా వయస్సు తక్కువగా ఉన్నవి కానీ, ఇతర జబ్బులు వచ్చిన గొర్రెలు కానీ పంపిణీ చేశారా అనే అంశాలను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సీఎంవో నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు హుటాహు టీన సమావేశమై నిర్ణయం తీసుకున్నారు.

### పశుసంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష

గొర్రెల రీసైక్లింగ్‌పై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై కలెక్టర్ శుక్రవారం ఉదయం తన చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ అధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్‌పై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- అన్ని శాఖల అధికారులను ఆదేశించిన కలెక్టర్

**మెండోర:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవనం పథకం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 10వ తేదీన పోచంపాడ్‌కు రానున్న నెపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ యోగితారాణా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గెస్ట్‌హౌజ్ నుంచి పైలాన్ ఆవిష్కరణకు బయలు దేరే రోడ్డు నిర్మాణ పనులు, పైలాన్ ఏర్పాట్లు బహిరంగ సభ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, గేస్ట్‌హౌస్, రోడ్డు నిర్మాణాలు, రోడ్డు డివైడర్ వెంట పూలచెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లలో పాల్గొనాలని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్ల గురించి ఏసీపీని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. కలెక్టర్ వెంట జేసీ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ శివశంకర్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ రామారావు, ఎంఆర్వో జయంత్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీని వాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



సీఎం సభాస్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ యోగితారాణా, అధికారులు

# దినఫలాలు

**అదృష్టసంఖ్యలు : 5, 8**

**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

**మిథునరాశి:(మే21-జూన్21):** పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

**కర్కాటకరాశి:(జూన్22-జూలై23):** స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

**సింహరాశి:(జూలై24-ఆగస్టు23):** వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

**కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23):** దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.


**మకరరాశి: (డిసెంబర్22-జనవరి21):** పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

**మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20):** ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# వంట గ్యాస్ సబ్సిడీకి మంగళం




- గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- ఇక సామాన్యుడికి భారం కానున్న వంటగ్యాస్

**ఆంధ్రజ్యోతి, కామారెడ్డి:** పెరుగుతున్న నిత్యావసర సరుకులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్య ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఇకపై గ్యాస్ ధరకు ప్రతి నెల రెక్కలు రానున్నాయి. నిత్యవసరమైన వంట గ్యాస్ సిలిండర్‌పై క్రమంగా పెంచుతూ సబ్సిడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని తొలగించి సిలిండర్‌పై రూ. 4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని భారం పడనుంది. కామారెడ్డి జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై సంవత్సరానికి రూ.1.10 కోట్ల భారం పడనుంది. ఒకే సారి కాకుండా రూ.4 పెంచుతూ రాయితీకి మంగళం పలకనుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంటుంది.

**జిల్లాలో 1.90లక్షల గ్యాస్ కనెక్షన్‌లు**

కామారెడ్డి జిల్లాలో 20 గ్యాస్ ఏజెంట్లు ఉన్నాయి. హెచ్‌పీసీఎల్, బీబీసీఎల్, ఐవోసీఎల్ సంబంధించి ప్రతి నెల గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,90,752 గ్యాస్ కనెక్షన్‌లు ఉండగా ఇందులో సింగిల్ సిలిండర్‌లు 63,487, డబుల్ సిలిండర్ లు 54,991, దీపం కనెక్షన్‌లు 42,639, సీఎస్ఆర్ కనెక్షన్‌లు 29,635, కమర్షియల్ కనెక్షన్‌లు 772 ఉన్నాయి. ప్రస్తుతం సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ రూ. 475.40 పైసలుగా ఉండగా గ్యాస్ ఏజెన్సీలు రూ. 630 వినియోగదారులకు అందజేస్తున్నారు. రూ. 153 సబ్సిడీ డబ్బులను వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. గ్యాస్ సిలిండర్‌ను ఇంటి వద్దకు తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నందుకు అదనంగా రూ.30 తీసుకుంటున్నారు. ఇప్పటికే భారంగా భావిస్తున్న సామాన్యులకు సబ్సిడీ ఎత్తివేత కారణంగా మరింత భారంగా మారనుంది.

**జిల్లాపై రూ.1.10 కోట్ల భారం**

వంట గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఎత్తివేసేందుకు ప్రతి నెల సిలిండర్‌పై రూ.4 పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్‌పై కేంద్రం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని వంటగ్యాస్ వినియోగదారులపై ప్రతి సంవత్సరం రూ.1.10 కోట్ల భారం పడనుంది. జిల్లాలో 1,90,752 గ్యాస్ సిలిండర్‌లకు నెలకు రూ.4 పెంచితే వినియోగదారులపై రూ.76 లక్షల భారం ప్రతి నెల ప్ర జలపై పడనుంది. అలాగే ఏడాది పాటు పెంచిన ధరలను లెక్కిస్తే రూ.1.10 కో ట్ల భారం గ్యాస్ వినియోగదారులపై పడనుంది. పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్యులకు వంట గ్యాస్ రావడంతో మరింత భారం కానుంది. సబ్సిడీ ఎత్తి వేయడంతో మళ్లీ కట్టెల పోయ్యే దిక్కవుతుందని వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీ ఎత్తివేతలో భాగంగా వినియోగదారులపై పెంచనున్న ధరను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ

- జిల్లా అంతటా రాఖీ పండుగ సందడి
- వెలసిన రాఖీల దుకాణాలు - స్వదేశీ రాఖీలే వాడాలి
- చైనా రాఖీలను బహిష్కరించాలని ప్రజల పిలుపు




కామారెడ్డి పట్టణంలో వెలసిన రాఖీల దుకాణాలు..

**కామారెడ్డి:** ఆత్మీయ అనుబంధాలకు, అన్న చెల్లెళ్ల అనురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తోంది. రాఖీ పండుగ వస్తుంది అనగానే ఇళ్లల్లో అన్న చెల్లెళ్ల అక్క తమ్ముళ్లు సంబుర పడిపోతారు. వారం రోజుల ముంది నుంచే రాఖీ పండుగ సంబురాలు కనిపిస్తాయి. రాఖీ పండుగ సమీపిస్తుండడంతో జిల్లా అంతటా రాఖీ సందడి నెలకొంది. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని దుకాణాల్లో రాఖీలు వెలిసాయి. ఇప్పటి నుంచే చెల్లెళ్ల, అక్కలు, అన్నయ్యల కోసం, తమ్ముల కోసం రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. రక రకాల రాఖీలు దుకాణాల్లో లభిస్తుండడంతో నచ్చిన రాఖీలను ఎంచుకొని కొనుగోలు చేస్తున్నారు. సోమ వారం రాఖీ పండుగ ఉండడంతో చెల్లెళ్ల, అక్కలు, అన్నయ్యలు, తమ్ముళ్ల వద్దకు వెళ్లి రాఖీలు కట్టడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. రాఖీ పండుగ అంటేనే ఎంతో ఇష్టపడే చెల్లెళ్లకు, అక్కయ్యలకు అన్నయ్యలు, తమ్ముళ్ల మరిచిపోలేని బహుమతులు అందిస్తారు. ఇప్పటికే జిల్లాలో బ్రహ్మకుమారిలు ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు కార్యాలయాల్లో రాఖీలను కట్టి రాఖీ పండుగ విశిష్టతను తెలుపుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులతో రాఖీలు కట్టిస్తూ నీవు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ విద్యార్థులతో వాగ్దానాలు చేయిస్తున్నారు. స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి రాఖీ పండుగ విశిష్ఠతను వివరిస్తున్నారు. చైనా రాఖీలు వాడవద్దని వారు పిలు పునిస్తున్నారు. స్వదేశంలో తయారైన రాఖీలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. చైనా దేశం మన దేశంలో వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదిస్తూ మనకు శత్రు దేశమైన పాకిస్తాన్‌కు మద్దతు పలుకుతున్నారని ప్రతి నిధులు జిల్లా అంతటా ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, మండల కేంద్రాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

# ఎనిమిది కాళ్లతో మేక పిల్ల జననం



ఎనిమిది కాళ్లతో జన్మించిన మేక పిల్ల

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని ఎలాలవాడకు చెందిన చొప్పరి పెద్ద గంగారాంకు చెందిన మేకకు శుక్రవారం ఎనిమిది కాళ్లు, నాలుగు చెవులతో అరుదైన మేకపిల్ల జన్మించింది. అయితే జన్మించిన వెంటనే మేక పిల్ల మృతి చెందింది. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు వింత మేక పిల్లను చూడటానికి బారులు తీరారు. మేక పిల్లను అందరూ ఆశ్చర్యంగా చూసి వెళ్లారు.

# 'నీటి పారుదలశాఖ' వద్ద పోలీసుల మోహరింపు

- నీరు విడుదల చేయడం సాధ్యం కాదు: ఎస్ఈ
- విడుదల చేయకుంటే సీఎంను అడ్డుకుంటాం: రైతులు



ఎస్ఈకి వినతిప్రతం అందజేస్తున్న రైతులు

**మెండోర :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి పారుదల శాఖ కార్యాలయం ముందు శుక్రవారం పోలీసులు భారీగా మోహరించారు. కాకతీయ, గోదావరి, లక్ష్మీ కాలువ ఆయకట్టు రైతులు నీటి విడుదల చేయాలని కార్యాలయం ముట్టడికి వస్తున్న విషయం తెలుసుకున్న ఏసీపీ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్యాలయం వద్ద బారీ భద్రత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐలు, ఎస్సైలు దూదిగాం, చాకిర్యాల్, కోడిచర్ల, సావెల్ గ్రామాలకు వెళ్లి సీఎం పర్యటన సందర్భంగా కార్యాలయం ముట్టడికి రావడం సరికాదన్నారు. గ్రామానికి ఐదుగురు చొప్పున వస్తే ఎస్ఈతో మాట్లాడిస్తామని రైతులకు సూచించారు. దీంతో నాలుగు గ్రామాల రైతులు నీటి పారుదలశాఖ కార్యాలయానికి వచ్చి ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డికి గోదావరికి 100 క్యూసెక్కుల నీటి విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రైతులతో మిషన్ భగీరధ పథకంలో భాగంగా గ్రామాలకు తాగు నీటికోసం 6 టీఎంసీల నీళ్లు అవసరం ఉందని, ప్రాజెక్టు నుంచి గ్రామాలకు 6 టీఎంసీలు ఇస్తే మిగిలేవే 3 టీఎంసీలేన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 500 క్యూసెక్కుల నీటి విడుదల తాగు నీటి కోసం విడుదల చేశామని ఈ పరిస్థితిలో గోదావరిలోకి నీటి విడుదల సాధ్యం కాదని ఎస్ఈ తెలిపారు.

**నీరు విడుదల చేయకుంటే సీఎంను అడ్డుకుంటాం..**

రెండు రోజుల్లో ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయకుంటే సీఎం ను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేశారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయని, ఈ సమయంలో తమకు సాగునీరు అవసరమన్నారు. వెంటనే నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రైలులో ప్రయాణికుడి బ్యాగు అపహరణ

- చోరీకి గురైన 20 తులాల బంగారం

**పెద్దబజార్:** రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్దనుంచి గుర్తు తెలియని ఆగంతకులు 20 తులాల బంగారం ఉన్న బ్యాగును అపహరించుకుపోయారని రైల్వే జీఆర్‌పీ ఎస్సై సాయినాథ్ తెలిపారు. శుక్రవారం ఉదయం ముంబాయి-సికింద్రాబాద్ మధ్య నడిచే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో పర్బని నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సందీప్‌కు చెందిన బ్యాగును మహారాష్ట్రలోని ధర్మాబాద్ వద్ద గుర్తు తెలియని ఆగంతకులు దొంగిలించుకుపోయినట్లు బాధి తుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



సినిమా వార్తల కొరకు
www.andhrajyothy.comను క్లిక్ చేయండి




నిజామాబాద్ జిల్లా అర్గుల్లిలో ఎండిన వరి పంట

# వరుణా.. కరుణించవా?

**» 20 రోజులుగా జాడ లేని వర్షాలు » ఉభయ జిల్లాల్లో ఎండుతున్న వరి, ఇతర పంటలు » బీటలు వారుతున్న భూములు » ఆందోళనలో రైతులు**

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

నిజామాబాద్ జిల్లాలోని బడా భీంగల్ గ్రామం మేజర్ గ్రామ పంచాయతీ. భీంగల్ మండలంలోని ఈ గ్రామంలో 400లకు పైగా రైతులు ఉన్నారు. వీరంతా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఈ గ్రామంలో యేటా వర్షాకాలంలో 800 ఎకరాలపైగా సాగు చేస్తారు. మండలం పరిధిలో చెరువులు, బోర్ల కింద సుమారు 10వేల ఎకరాల వరకు వరిసాగు చేస్తారు. ఈ యేడాది కూడా ఎక్కువ మంది రైతులు వరినార్లు పోశారు. వర్షాలకు ఎదురు చూశారు. బడాభీంగల్ గ్రామంలో సుమారు 400 ఎకరాలకు పైగా వరిసాగు చేశారు. మొత్తం బోర్ల కిందనే పంట వేయడం వల్ల వర్షాలు పడక ప్రస్తుతం ఎండిపోయే దశలో ఉన్నాయి. కొంతమంది రైతుల పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. వరికోసం ఎకరాకు ఆరు నుంచి పదివేల వరకు డబ్బులు ఖర్చు చేసిన రైతులు ప్రస్తుతం పంటలు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ మండలంకు ప్రాజెక్టు కాలువలు లేకపోవడం వల్ల కేవలం చెరువులు, బోర్ల కిందనే సాగు చేస్తున్నారు. బడాభీంగల్ గ్రామానికి చెందిన మోర్తాడ్ చిన్న గంగాధర్ వర్షం రూ. 30వేలకు పైగా పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాలలో నాట్లు వేశాడు. వర్షం ముఖం చాటేసింది. బోర్లు, భూగర్భ జలాలు లేక మొరాయించాయి. పొలం ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు. యాసంగిలో నీళ్లు ఉండడం, వర్షాలు వస్తాయనే నమ్మకంతో మొదట పడిన వర్షాలకు వరిసాగు చేశానని ఆ రైతు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. ఇదే పరిస్థితి ఆ గ్రామంలోని తర్కం నడిపి సాయిలుకు ఏర్పడింది. ఎంతో కష్టపడి మొదట పడిన వర్షంతో రెండు ఎకరాల పొలం వేశాడు. వర్షం లేదు. చెరువులో నీళ్లు లేవు. బోర్లలో నీళ్లు దగ్గరపడడంతో పొలం ఎండిపోయిందన్నారు. భారీ వర్షాలు పడుతాయని ఆశిస్తే మొదటికే మోసం వచ్చిందని ఆయన తెలిపారు. ఇదే పరిస్థితి నవీపేట మండలం అశోక్ ఫారానికి చెందిన రైతులకు ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన రైతు రాజుతో ఐదు ఎకరాల పంటభూమి ఉంది. దీంతో పాటు 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం 20 ఎకరాల వరకు రెండు బోర్ల కింద సాగు చేశాడు. ప్రస్తుతం పది ఎకరాల వరకు పంట ఎండిపోయింది. ఉన్న బోరు నీళ్లతో ఆ పది ఎకరాలు కాపాడుకుంటున్నాడు. వర్షాలమీద ఆశతో వరిసాగు చేశానని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో తెలిపాడు. నిజాంసాగర్ నీళ్లు వస్తాయని ఎక్కువగా సాగు చేశానన్నారు. సుమారు 2లక్షల వరకు కౌలుకు, పెట్టుబడికి ఖర్చు పెట్టానని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు డీ54 కాలువ ద్వారా నీళ్లు అందిస్తే పంటలు కాపాడుకుంటామని ఆయన కోరుతున్నాడు. ఇదే పరిస్థితి ఈ గ్రామంలోని సుధాకర్ అనే రైతుకు ఏర్పడింది. ఆయన సుమారు 35వేల వరకు ఖర్చు చేసి ఐదు ఎకరాల పొలం వేశాడు. మొత్తం పొలం నీళ్లలేక ఎండిపోయింది. బోర్లు మొరాయించడంతో ప్రస్తుతం ఏం చేయలేని పరిస్థితిలో ఆ రైతు ఉన్నాడు. ప్రభుత్వం కరెంటు ఇచ్చినా వినియోగించని పరిస్థితుల్లో తాము ఉన్నామని ఆయన తెలిపారు. నిజాంసాగర్‌కు సింగూరు జలాలను తరలించి తమను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ జిల్లాలో ఈ యేడాది ఖరీఫ్‌ను ఎన్నో ఆశలతో మొదట రైతులు మొదలు పెట్టారు. గత యేడాది లాగానే వర్షాలు పడుతాయని ఆశించారు. భారీగా వరి సాగుకు ఉద్యమించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు సగటు వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 490 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 318 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే పడింది. వాతావరణ శాఖ వారి అంచనాల ప్రకారం జిల్లాలో 49 సెంటీమీటర్ల వర్షం పడాలి. జిల్లాలో జూన్‌లో 19 సెంటీమీటర్లు, జూలైలో 30 సెంటీమీటర్లు పడాలి. జిల్లాలో మాత్రం ఈసారి తక్కువ పడింది. గతంతో పోల్చితే బాగా తక్కువగా ఉంది. ఈ యేడాది జిల్లాలో 4.83 లక్షల ఎకరాలలో పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఇప్పటికే కేవలం 3.5 లక్షల ఎకరాలలో మాత్రమే సాగు అయ్యింది. జిల్లాలో వరిసాగు 1.35లక్షల ఎకరాలకు చేరింది. జిల్లాలోని బోధన్, వర్ని, కోటగిరి, రుద్రూర్, నవీపేట, రెంజల్, ఎడపల్లి, మాక్లూర్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్, మోపాల్, ధర్పల్లి, భీమ్‌గల్ మండలాలలో వరి ఎక్కువగా సాగు చేశారు. అప్పుడప్పుడు పడే వర్షాల వల్ల సోయా, మొక్కజొన్న, పప్పుదినుసుల పంటలకు ఇబ్బందులు లేవు. వరిపంట మాత్రమే ఎక్కువగా దెబ్బతింటున్నాయి. భూగర్భ జలాలు తగ్గడంవల్ల ఎక్కువగా ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో సగటున 8 మీటర్లలోతులో ఈ జలాలు ఉన్నాయి. భారీ వర్షాలు పడుతాయని, నిజాంసాగర్, ఎస్సారెస్పీల నుంచి సాగునీరు అందుతుందనే నమ్మకంతో ఎక్కువ మంది రైతులు వరిసాగుకు వైపు మొగ్గుచూపారు. గత రబీలో ఎక్కువగా దిగుబడి రావడం, చెరువులలో కొద్దిమేర నీళ్లు ఉండటం బోర్ల కింద ఈ సాగు చేశారు. రైతులందరూ బోర్లను ఒకేసారి వినియోగించడం వల్ల భూగర్భ జలాలు తగ్గడంతో కొన్నిచోట్ల రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. వచ్చే పదిరోజుల్లో వర్షాలు పడకుంటే ఎక్కువ మొత్తంలో ఎండిపోయే అవకాశం ఉందని రైతులు 'ఆంధ్రజ్యోతి'తో తమ ఆందోళనను వివరించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొన్నిచోట్ల తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నా నీళ్లు లేకపోవడం వల్ల రైతులు వినియోగించడం లేదు. ఎండలు కూడా 34 డిగ్రీకి చేరడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి ఎక్కువనీరు వరికి అవసరమవుతున్నాయి. వీటితో పాటు మొక్కజొన్న, సోయా, ఇతర పంటలకు కూడా వర్షం పడని చోట బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. జిల్లాలోని వరి పంటను కాపాడేందుకు సింగూరు నుంచి నిజాం సాగర్‌కు నీటిని విడుదల చేయాలని కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నాలు చేస్తున్నారు. బీజేపీ, టీడీపీ పార్టీలు పంటల కోసం నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ఆరుతడి పంటలకు పెద్దగా ఇబ్బంది లేదని కేవలం వరిపంటకు మాత్రమే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని జేడీఏ వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఎప్పటికప్పుడు నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని ఆయన వివరించారు.





కామారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లిలో వర్షాల కోసం బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## కామారెడ్డి జిల్లాలో ఇలా..

**ఆంధ్రజ్యోతి-కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. 20 రోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో వేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. చిన్నపాటి జల్లులు తప్ప పెద్ద వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదు. చెరువులు, కుంటల్లో నీరు లేక భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో జిల్లాలో వరినాట్ల కోసం దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న మళ్లు, వరి నాట్లు వేసిన మళ్లు ఎండిపోవడమే కాకుండా వర్షాదార పంటలైన మొక్కజొన్న, పత్తి, సోయాలు వాడిపోతున్నాయి. తొలకరి జల్లులు ముందస్తుగానే పలకరించడంతో కాలం కలిసోస్తుందనే ఆశతో కామారెడ్డి జిల్లా రైతులు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. కానీ కరువు చాయలు కమ్ముకోవడంతో రైతుల ఆశలన్నీ ఆవిరవుతున్నాయి. వర్షాలు లేకపోవడంతో రైతులు సైతం 10 రోజులుగా వరినాట్లు వేయడం ఆపివేశారు. ఈ ఖరీఫ్‌లో 4లక్షల 87వేల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటివరకు జిల్లాలో 3,17,174 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు 7,677.9 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా 6985.4 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. జిల్లాలో 10 మండలాల్లో సాధారణ వర్షాపాతం కంటే తక్కువ వర్షాపాతం నమోదైంది. ఇదే పరిస్థితి మరో వారం రోజులు ఉంటే వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎండుతున్న పంటలు..

20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో కామారెడ్డి జిల్లాలో రైతులు వేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. పంటపొలాల్లో నీరు లేక బీటలు వారుతున్నాయి. ఇప్పటివరకు దుక్కులు దున్నడానికి విత్తనాల పెట్టుబడులు తెచ్చి పెట్టినప్పటికి కాలం అనుకూలించకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. ఒక్కటైనా గట్టివాన కురుస్తే తమ పంటలు దక్కుతాయని ఆశతో ఆకాశం వైపు చూస్తున్నారు. మేఘాలు కమ్ముకస్తున్నప్పటికీ వర్షాలు కురుస్తలేవు. కాలం గడుస్తున్న కొద్ది రైతుల్లో ఆశలు ఆవిరవుతన్నాయి. వర్షాలు కురవక చెరువులు, కుంటల్లోకి నీరు రాక పంటలకు నీరు అందుతుందోలేదనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### వర్షాల కోసం ఎదురుచూపులు..

కొద్ది రోజులుగా వరుణుడి జాడ లేకపోవడంతో వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. వర్షాలు కురవాలంటే దేవతలకు జలాభిషేకాలు చేస్తున్నారు. వర్షాలు కురిస్తే పంటలకు ఊపిరి పోసినట్లు అవుతుందని వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

### కామారెడ్డి జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదు..

కామారెడ్డి జిల్లాలో సాధారణ వర్షాపాతం కంటే తక్కువ వర్షాపాతం నమోదైంది.జిల్లాలో ఇప్పటివరకు 7,677.9 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 6985.4 మిల్లీమీటర్ల వర్షాపాతం మాత్రమే నమోదైంది. ఈ వర్షకాలం ప్రారంభంలో విస్తారంగానే వర్షాలు పడ్డాయి. అదే ఆశతో వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు విస్తారంగా పంటలను సాగు చేశారు. కానీ వర్షాలు ముఖం చాటేయడంతో రైతుల ఆశలన్నీ ఆడియాశలవుతున్నాయి. 20 రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితు లు నెలకొంటున్నాయి. జిల్లాలోని సదాశివ నగర్, గాంధారి, మాచారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట్, పిట్లం, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షాపాతం నమోదైంది.

### వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయి..



జూన్ నెలలో అతి తక్కువ వర్షం కురువడంతో అనేక చోట్ల పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. ఎకరాన రూ.10వేల చొప్పున 5 ఎకరాలు కౌలుకు తీసుకోని పత్తిపంట సాగు చేశాను. మొదట్లో వర్షాలు కురువడంతో అధిక పెట్టుబడితో పంటలు సాగు చేశాను. వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తిపంట ఆశించిన విధంగా పెరగకపోగా పూర్తిగా ఎండుదశకు చేరుకుంటోంది. రెండుమూడు రోజుల్లో వర్షాలు కురువకపోతే పంట ఎండిపోయి ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉంది.

**- రమేశ్, రైతు, భూంపెల్లి, కామారెడ్డి జిల్లా**

### నిజాంసాగర్‌ను నమ్మి పంటలు వేసుకున్నాం...

నిజాంసాగర్ ప్రాజెక్టును నమ్మి వరి పంటలను సాగు చేశాను. సుమారు 5 ఎకరాల కౌలుభూమిలో వరినాట్లు వేయక వర్షాలు పడటం లేదు. చెరువులో సైతం నీరు తగ్గిపోతుండటంతో పంటలు పండుతాయా అన్నది సందేహంగా మారింది. సింగూరు నీటిని నిజాంసాగర్‌కు విడుదల చేసి నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాలి. లేకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సింగూరు నుంచి సాగునీటి విడుదలకు చర్యలు చేపట్టాలి.



**పార్వతి ప్రవీణ్, యువరైతు, రుద్రూరు, నిజామాబాద్ జిల్లా**



కామారెడ్డి జిల్లాలో నీరు లేక ఎండుతున్న మొక్కజొన్న పంట




నిజామాబాద్ జిల్లా ముల్లంగి శివారులో ఎండిపోతున్న వరి పంట



సదాశివనగర్‌లో ఎండిపోతున్న పత్తి పంట



మద్నూర్‌లో వాడిపోతున్న సోయాపంట



వర్ని శివారులో వరినారు ఎండిపోవడంతో దిగులుగా కూర్చున్న రైతు



కామారెడ్డి మండలంలో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు



రుద్రూరు శివారులో ఎండిపోతున్న వరిపంట

ఆంధ్రజ్యోతి 16
బాన్సువాడ
కామారెడ్డి । శనివారం 5 ఆగస్టు 2017
బాన్సువాడ । బీర్కూర్ । నసురుల్లాబాద్

## నేడు శ్రీవారి సన్నిధిలో వరుణ యాగం

**బీర్కూర్:** బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిసన్నిధిలో శనివారం వరుణ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇటి కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీ సమేతంగా పాల్గొని యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

**ఇంటర్వ్యూ**

## రైతు సమగ్ర సర్వే సక్రమంగా కొనసాగుతోంది



రామారావు, వీఆర్వో -మిర్జాపూర్

**ఆంధ్రజ్యోతి:** మిర్జాపూర్ గ్రామ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయి? వాటిలో ఎంత మేర నీటి నిలువలు ఉన్నాయి?

**వీఆర్వో:** మిర్జాపూర్‌లో పెద్ద చెరువు, నెల్లకుంట చెరువులు ఉన్నాయి. ఈ రెండు చెరువుల్లో 85శాతం మేర నీటి నిలువలు ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** పెద్ద చెరువు, నెల్లకుంట కింద ఎన్ని ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది? ఎంత మేర నాట్లు పడ్డాయి?

**వీఆర్వో:** పెద్ద చెరువు కింద 1282 ఎకరాలు, నెల్లకుంట కింద 30 ఎకరాలు సాగు విస్తీర్ణం ఉంది. 50శాతం మేర నాట్లు పడ్డాయి.

**ఆంధ్రజ్యోతి:** మిర్జాపూర్ గ్రామ పరిధిలో మొత్తం విస్తీర్ణం ఎంత?

**వీఆర్వో:** మిర్జాపూర్ శివారులో 1891 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది.

**ఆంధ్రజ్యోతి:** రైతు సమగ్ర సర్వే ప్రక్రియ సక్రమంగా కొనసాగుతుందా?

**వీఆర్వో:** రైతు సమగ్ర సర్వే ప్రక్రియ సక్రమంగా కొనసాగుతోంది. రైతుల సర్వే నంబర్లు , పహాణీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

**లెన్స్ స్టోరీ**

## ఇలాగైతే రోగాలు రావా?



తాగునీటి పంపు వద్ద బట్టలు ఉతుకుతున్న స్థానికులు

నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న బోరుబావిలో గ్రామపంచాయతి సిబ్బంది సింగిల్‌ఫేజ్ మోటరును ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి స్థానికులు తాగునీటిని తీసుకవెళ్తుంటారు. ఇది ఇలా ఉండగా స్థానిక మహిళలు తాగునీటి బోరు వద్దే బట్టలను యథేచ్ఛగా ఉతుకుతున్నారు. దీని వల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. గ్రామపంచాయతి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- బీర్కూర్

# గ్రామ పంచాయతీ భవనం పూర్తయ్యేదెన్నడో?

● నిధులు లేక ముందుకు సాగని భవన నిర్మాణం ● 8 ఏళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న పనులు

**బీర్కూర్:** దేశానికి పల్లెలే పట్టుకోమ్మలు అని జాతి పిత మహాత్మగాంధీ ఎప్పుడో చెప్పాడు. కానీ ఆ పల్లెలకే గుండెకాయ లాంటి గ్రామపంచాయతీలు పూర్థిగా శిథిలావస్థకు చేరుకుని, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు కానీ, పాలకులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడుస్తున్న గ్రామాల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఇలా ఉండగా గత 8 ఏళ్ల క్రితం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వలన ఇప్పటి వరకు ఆ భవనం పూర్తి కాలేదు. 8 సం.ల క్రితం రూ. 1లక్ష 32 వేల బీఆర్‌జీఎఫ్ నిధులతో ప్రారంభించారు. అనంతరం మరో విడత 1.32లక్షల బీఆర్‌జీఎఫ్ నిదులు విడుదల కావడంతో స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తి చేశారు. ఇది ఇలా ఉండగా మిగిలిన మొత్తాన్ని గ్రామపంచాయతీ నిధులను సమకూర్చి స్లాబ్‌ను కూడా నిర్మించారు. ఇక నిదుల కోరత ఉండడంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల కోసం నిధులు కేటాయిస్తే గానీ ఈ భవనం పూర్థిస్థాయిలో నిర్మాణం అవుతుందని స్థానిక సర్పంచ్ లక్ష్మీ రవికుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి భవనం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జర దేఖో!!

అసంపూర్తిగా నాచుపల్లి గ్రామపంచాయతీ భవనం

## 'అవినీతి రాయుళ్లపై చర్యలు తీసుకోవాలి'

**బాన్సువాడ టౌన్:** మద్నూర్ మండలంలోని ఎంఈవో కార్యాలయంలో అవినీతి రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శుక్రవారం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఆర్డీవో తక్షణమే అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిద్దిరాములు, రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

**బీర్కూర్:** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్ వాణి గర్భిణులకు అంగన్‌వాడీ సిబ్బందికి తల్లిపాల ఆ వశ్యకతపై అవగాహన కల్పించారు. ఇందులో సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

# వసతి గృహా వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

**బాన్సువాడ:** పట్టణంలోని ఎస్టీ జూనియర్ కళాశాలల వసతి గృహవార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాన్సువాడ పట్టణానికి చెందిన విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, టీజీవీపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం బోజనం పెట్టడం లేదని, వసతి గృహానికి వారానికి రెండు రోజులు మాత్రమే రావడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా తాగునీటి సమస్య, కిటికిలు లేకపోవడం, మౌలిక సదుపాయల కల్పనలో వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఏవో నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కోనాల గంగారెడ్డి, ఖలీల్, జానీత్, మహేష్, గంగాదర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డీఏవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

## 'చలో ఢిల్లీని విజయవంతం చేయండి'

**బాన్సువాడ టౌన్:** బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జి వనం గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అర్‌అండ్‌బి అతిథి గృహంలో చలో డిల్లీకి సంభందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు చట్టసభలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైమద్, సాయిరాం, నాగభూషణం, మారుతీ, చింటు తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు నీటి కోసం పోరాటం చేస్తాం

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాల్‌రాజ్

**బాన్సువాడ టౌన్:** సింగూరు జలాల విడుదల కోసం రైతాంగం పక్షాన నిలిచి నిజాంసాగర్‌లోకి విడుదల చేసేంత వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని శ్రీనివాసగార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. పదిహేను రోజులుగా వర్షాలు లేక రైతన్నలు అవస్థలు పడు తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం నేడు, రేపు అంటు కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే సింగూరు నీటిని నిజాం సాగర్‌లోకి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో శనివారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో అఫ్రోజ్, చంద్రశేఖర్‌గౌడ్, గణేశ్ పాల్గొన్నారు.

**బీర్కూర్:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంభి స్తుందని ఆరోపించారు. ప్రతి పక్షపార్టీగా కాంగ్రెస్ ఎంతగానో పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోగు నారాయణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ అహ్మద్, నాయకులు ఆరీఫ్, నారంశ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

**బాన్సువాడ టౌన్:** పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో శనివారం బీజేపీ జిల్లా కార్యావర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, వెంకట రమనిలు, జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు , జిల్లా కార్యవర్గసభ్యులు తదితరులు హాజరు కావాలని ఆయన కోరారు.

# భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ మాత పూజలు

**పిట్లం:** మండలంలోని 14 గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఘనంంగా మహిళలు వరలక్ష్మీ మాత పూజలు చేశారు. లక్ష్మీమాతను పూలతో అలంకరించి, ధూపధీప, నైవేధ్యంతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఒకరికి ఒకరూ వాయనాలను ఇచ్చిపుచ్చుకున్నారు. పూజలు చేసిన మహిళలు , కుటుంబ సభ్యులకు అష్టఐశ్వర్యాలు కలిగించాలని లక్ష్మీ మాతను భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

**మద్నూర్:** పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే నారాయణ ప్రియ దేవి సుప్రీతా భావ సర్వదా.. అంటూ మహిళలు సాముహికంగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శ్రవణ శుక్రవారం పురస్కరించుకకుని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో 101 వరలక్ష్మీ వ్రతాలను సామూహికంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో ఆలయ నిర్వాహకులు గోవింద్ సేవ, డా. రమణ పాల్గొన్నారు.

**బాన్సువాడ:** బాన్సువాడ డివిజన్‌లోని జుక్కల్, మద్నూర్, పిట్లం, పెద్ద కొడప్గల్, బిచ్కుంద, నిజాంసాగర్, బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాలలోని గ్రామల ప్రజలు శుక్రవారం మూల నక్షత్రం వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, దీపారాధన చేపట్టి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలతో వరలక్ష్మీ వ్రతాన్ని చేపట్టి మంగళహారతులు చేపట్టి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పల్లకి సేవ, పూజ కార్యక్రమాలను నిర్వహించారు.



పిట్లంలో వరలక్ష్మీ వ్రతం పూజలు చేస్తున్న మహిళలు

## ముగిసిన రుద్ర హోమం..

**బాన్సువాడ టౌన్:** అయ్యప్ప ఆలయంలో ఈ నెల 2 నుంచి ప్రారంభం అయిన రుద్ర హోమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు రోజున వేద పండితులు ఆలయ కమిటి సభ్యులు హోమ కార్యక్రమాన్ని నిర్వహించి, పూర్ణహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పాండురంగ శర్మ, పురుషోత్తమ శర్మ, శ్రీనివాస శర్మ, అయ్యప్పస్వామికి వేధ మంత్రోచ్ఛరణల మధ్య నవవిద అభిషేకాలను నిర్వహించారు.

**హలో..హలో..**

**వేల్పూర్ మండల అధికారుల ఫోన్ నెంబర్లు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఎంపీడీవో | 7095510983 | ఏపీఎం | 8790990142 | మం.పశువైద్యాధికారి | 9603625163 |
| తహసీల్దార్ | 9491036905 | పీహెచ్‌సీ డాక్టర్ | 9440795469 | ఈజీఎస్‌ఏపీవో | 7095510130 |
| ఈవోపీఆర్డీ | 9347356708 | ఎంఈవో | 8341146834 | ట్రాన్స్‌కో ఈవో | 9440811636 |
| ఎస్సై | 9440795469 | ఐకేపీ ఏపీఎం | 8790990142 | ఆర్‌డబ్ల్యూఎస్ ఈవో | 8885553302 |
| వ్యవసాయాధికారి | 7288894585 | ఇరిగేషన్ ఏవో | 9701367502 | | |

# ‘సీఎం సభకు రైతులు అధిక సంఖ్యలో రావాలి’

**మెండోర:** మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల తెరాస పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులు బాగుండాలని కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 60 టీఎంసీలు నీళ్లను తీసుకరావడానికి 1050 కోట్ల పనులకు శంకు స్థాపన చేయడానికి ఈ నెల 10వ తేదీ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవనం భారీ బహిరంగా సభకు వస్తున్నందున రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాల ప్రజలు, తెరాస కార్యకర్తలు సీఎం కేసీఆర్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దోనకంటి చిన్న గంగయ్య, తెరాస పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, తెరాస గ్రామ అధ్యక్షుడు పల్లె రాములు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మిట్టపల్లి వెంకట్ రెడ్డి, కేసీఆర్ సేవదళం జిల్లా కో-కన్వీనర్ వడ్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** ఈ నెల 10 న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద నిర్వహింపబడే రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు బహిరంగ సభకు మండలంలోని రైతులు భారీగా తరలించే విధంగా ప్రతి గ్రామ కార్యకర్త తన వంతు కృషిచేయాలని టీఆర్ఎస్ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి


కమ్మర్‌పల్లి లో టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్

భాస్కర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు లుక్కగంగాధర్‌లు కోరారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యకర్తల సర్వసభ్యసమావేశం శుక్రవారం దేవీ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు మాట్లాడుతు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రివర్స్‌పంపింగ్ శంకుస్థాన కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ రాన్ను సందర్భంగా మండలంలోని గ్రామాలనుండి జనసమాకరణ కోసం ప్రతి గ్రామ కార్యకర్తలు ప్రణాలిక రూపొందించుకోవాలన్నారు. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. కాళ్వేరం నుండి రివర్‌పంపింగ్ ద్వార ప్రతి రోజు 1 టీఎంసి చొప్పున 60 రోజుల్లో 60 టీఎంసీల నీటితో ఎస్సారెస్పీ నింపడం పథకంద్వార పెండింగ్‌లో ఉన్న చేవెళ్ల, ప్రాణహిత ప్యాకేజీలు పురుద్ధరింపబడి మండలంలోని మారుమూల గ్రామాలు సాగునీటితో కలకలలాడుతాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తయితే శ్రీరాంసాగర్ వరద కాలువలో నిత్యం 21 టీఎంసీల నీరు నిలువ ఉంటాయని దీంతో కాలువకు ఇరుపక్కల భూగర్భజలాలు పెరిగికి సాగునీటికి డోకా ఉండదన్నారు. ఈ పథకం ద్వార బాల్కొండ నియోజికవర్గ ప్రజల, రైతుల కళ్లలో ఆనందం చూడాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి కళ నెరవేరుతుందన్నారు. రివర్స్ పంపింగ్ ప్రాజెక్ట్ పనుల శంకుస్థానకు విచ్చేస్తున్న కేసీఆర్‌కు పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు తరళివచ్చి సభను విజయవంత చేయాలని కోరారు. రివర్స్ పంపింగ్ ప్రాజెక్ట్ పథకాన్ని రూపొందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రుణం మరువకూడదని, పథకం రూపకల్పనలో అశేష కృషిచేసిన మంత్రిహరీష్‌రావు, ఎంపీ కవిత, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిలకు సమావేశం కృతజ్ఞతలు తెలుపు తీర్మాణించింది. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బద్దం చిన్నారెడ్డి, టీఆర్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత శ్రీకుమార్, సింగిల్ విండో చైర్మన్ బద్దం భాస్కర్ రెడ్డి, జిల్లా, మండల నాయకులు మలావత్‌కౌసల్య ప్రకాష్, సామ బాపురెడ్డి, వేముల శ్రీనివాస్, రేగుంట దేవేందర్, బోడ దేవేందర్, వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోంచందలో 16 యూనిట్ల గొర్రెల పంపిణీ

**ఏర్గట్ల:** మండలంలోని దోంచంద గ్రామంలో శుక్రవారం యాదవులకు 16 గొర్రెల యూనిట్లు టీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గొర్రెల యూనిట్‌లు పొందిన యాదవులు వాటి ద్వారా ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి శ్రీనివాస్, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దకాపు శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు ఆశిరెడ్డి శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు గద్దె గంగారాం, పెద్ద అంజయ్య తదితరలు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో కస్తూర్బా, ఎమ్మార్సీ నిర్మాణాల కోసం స్థల పరిశీలన

**బాల్కొండ:** ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కస్తూర్బాగాంధీ పాఠశాల, మండల విద్యావనరుల కేంద్రం నిర్మాణం కోసం శుక్రవారం రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్‌ఏ) ఏఈ శ్రీనివాస్ స్థలాన్ని పరిశీలించారు. అయితే నూతనంగా ఏర్పడిన మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎమ్మార్సీ నిర్మాణం కోసం మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో కస్తూర్బా గాంధీ పాఠశాలకు రూ. 2.27 కోట్లు, మండల విద్యావనరుల కేంద్రం కోసం రూ. 31లక్షల నిధులు మంజూరుకాగా ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు చేపడుతామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. నిర్మాణాల కోసం స్థలం అనువుగా ఉందని, ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపుతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముస్కు భూమేశ్వర్, మండల విద్యాదికారి బట్టు రాజేశ్వర్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సామవెంకట్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గుమ్మిర్యాల్‌లో గ్రంథాలయం ప్రారంభం

**ఏర్గట్ల:** మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బామ్‌సేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య హాజరై గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో పులే, అంబేద్కర్ వాదానికి సంబంధించిన సాహిత్యం అలాగే విద్యార్థుల పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, క్రమశిక్షణగా గ్రంథాలయాన్ని కొనసాగిస్తూ అందరూ జ్ఞానాన్ని పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బొల్లి శేఖర్, ఉపాధ్యక్షుడు రంజిత్, రాజేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ‘తల్లిపాలలోనే సంపూర్ణ పోషకాహారం’

**భీమ్‌గల్ :** పుట్టిన ప్రతి బిడ్డకు తల్లులు తల్లిపాలనే ఇవ్వాలని అందులో సంపూర్ణ పోషకాహారం వుంటుందని జిల్లా అంగన్‌వాడీ ప్రాజెక్టు ఆఫీసర్ స్రవంతి అన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ స్రవంతి , ఆర్ఓ బంగారు నవీనీతలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, తల్లులకు, గర్భవతులకు వివరించారు. పట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే అందులో రోగనిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీ, సర్పంచ్ రవినాయక్, భీమ్‌గల్, ఆర్మూర్ సీడీపీవోలు సుధారాణి, ఉషారాణి, సూపర్‌వైజర్లు, సుగుణ, జ్ఞానేశ్వరి, టి. రమాదేవి. సరస్వతీ , నీరజ, వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిసిమి పాఠశాల విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీలు

**కమ్మర్‌పల్లి:** తెలంగాణ పోస్టల్ శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మిసిమి ఉన్నత పాఠశాల పోస్టల్ శాఖ వారి ఆధ్వర్యంలో దాయిహాకర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతిపితా మహాత్మగాంధీ ఎలా ప్రభావితం చేశారు అనే అంశంపై లెటర్ రైటింగ్ పోటీలు నిర్వాహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలి రవిందర్, టీచర్లు శ్రీనివాస్,కార్తిక్, దశరథం, బాలకిషన్, రాజశ్రీ, రాకే ష్, రాజేష్, మాధురి, వస ంత్, చంద్రమౌళి, నర్సింహస్వామి, లావణ్య,పోస్టల్ సేవింగ్స్ ఏ జంట్ జిల్లా వసంత్ విద్యార్థులు పాల్గొన్నారు.



## హిందీ ప్రచార సభ పరీక్షలు ఆగష్టు 10 వరకు పొడగింపు

**ఏర్గట్ల:** హిందీ ప్రచార సభ హైదరాబాద్ వారు సెప్టెంబర్‌లో నిర్వహించే హిందీ పరీక్షలను ఆగష్టు 10 లోపు పరీక్షల ఫీజు చెల్లించాలని హిందీ ప్రచారక్, తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జికె రామేశ్వర్ తెలిపారు. 5, 6వ తరగతి ఉత్తీర్ణులు హిందీ ఉత్తమ పరీక్షకు, 7 నుండి తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులు హిందీ విశారద (ఎస్సెస్సీ స్థాయి) పరీక్షలకు, 10వ తరగతి ఉత్తీర్ణులు హిందీ భూషన్ (ఇంటర్ స్థాయి) పరీక్షలకు, ద్వితీయ భాష హిందీలో ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు హిందీ విద్వాన్ (బీఏ స్థాయి) పరీక్షలకు అర్హులని అన్నారు. విద్వాన్‌తో హిందీ పండిత్ ట్రైనింగ్ చేయవచ్చని ఇతర వివరాలకు 9440550886 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. నిరుద్యోగులు, గృహిణులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఏపీఎంకు సమ్మె నోటీస్

**బాల్కొండ:** ఇందిరా క్రాంతి పథకం ఐకేపీలో పని చేసే సిబ్బంది శక్రవారం ఏపీఎం గంగాధర్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఉద్యోగ భద్రత, రూ. 18500 కనీస వేతనాలు, పీఎఫ్, ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని ప్రభుత్వ అలవెన్సులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల15లోపు సమస్యలు పరిష్కరించని యెడల నిరవదిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యోగేష్, రవి, శరత్ ఉన్నారు.

## శ్రీభాషిత కళాశాలలో రక్షాబంధన్

**కమ్మర్‌పల్లి:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని శ్రీబాషిత జూనియర్ కళాశాలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, డైరెక్టర్ సుంకెట్‌రవి, సంజీవ్, సంతోష్, వేణు, అధ్యాపకులు సుమన్,హన్మాండ్లు, కిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసిన కొన్నాళ్లకే పాడైతే ఎలా ?


తారురోడ్డు పై నిర్భయంగా వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

**వేల్పూర్:** మండంలంలోని పలు గ్రామాల రోడ్డు పాడవుతున్నాయి. అందుకు కారణమవుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్లను బీటీ రోడ్లపై తిరగకుండా అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ట్రాక్టర్లు కేజ్‌వీల్‌తో తారోడ్డుపై నిర్భయంగా తీరుగుతూ పొలాల్లోకి వెళ్తున్నాయి. సుమారు గత ఏడాది క్రితం మండలంలోని పలు గ్రామాల రోడ్డు బీటీతో కళకళలాడాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి బీటీ వేశారు. ఆ రోడ్ల కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిప్పడం వల్ల తారుపూర్తిగా చెడిపోయి కంకర రాళ్ల పైకి తేలుతున్నాయి. జాన్కంపేట్ , సాహెబ్‌పేట్ , మోతె, అక్లూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాల రోడ్లు కేజ్‌వీల్ ట్రాక్టర్లు పుణ్యమని బీటీ ఊడిపోయి కంకర రాళ్ళు, గుంతలు దర్శనమిస్తున్నాయి. రోడ్లు దెబ్బతినడానికి కేజీవీల్ ట్రాక్టర్లు దానికి తోడు రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం కూడా కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. దశాబ్దాల పాటు ఎంతో మన్నికతో ఉండాల్సిన రోడ్లు వేసిన కొన్నాళ్లాకే దెబ్బతినడం పట్ల ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికై కేజ్‌వీల్ ట్రాక్టర్లు బీటీ రోడ్లపై తిరగకుండా అధికారులు, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**బీటీరోడ్లపై తిరిగే కేజ్‌వీల్ ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి**
**-సొడ జైరాజ్, జాన్కంపేట్**



లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన బీటీ రోడ్ల పై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిరిగితే అధికారులు వాటిపై తగిన చర్యలు తీసుకోవాలి. అవసరమైన కేజ్‌వీల్ ట్రాక్టర్ల యజ మానుల కేసులు పెడుతు తగిన జరిమానాలు విధించారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన డీఆర్వో

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం డీఆర్వో రమేష్ సందర్శించారు. తిమ్మాపూర్‌లో ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఫిర్యాదు రావడంతో ఆయన తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కాగా ఫిర్యాదు దారు చేసినట్లు ఉద్యోగి ప్రభుత్వ భూమిని ఆక్రమించలేదని అది పట్టా భూమని ఆర్డీవో తేల్చి చెప్పారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో రికార్డులు బైండింగ్ చేయించి భద్రంగా ఉంచాలని ఆదేశించారు. బైండింగ్ చేయడం వల్ల రికార్డులు భద్రంగా ఉంటాయని అన్నారు. ఈ విచారణలో తహసీల్దార్ సూర్యప్రకాష్, డీటీ జనార్దన్, వీఆర్వోలు పాల్గొన్నారు.


వివాదాస్పద భూమి రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్వో రమేష్

# ఐకేపీ కార్యాలయలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**కమ్మర్‌పల్లి:** వీవోఏల వేతనాలు పెంచుతు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపట్ల హర్షం వ్యక్తం శుక్రవారం కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో సిబ్బంది రాష్ట్ర ముక్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. వీవోఏల గౌరవ వేతనం 5 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం కుట గంగారెడ్డి, సీఏల యూనియన్ మండల అధ్యక్షుడు సుభాష్, సీసీలు రవి, న్యాయమూర్తి, అలేఖ్య, సిబ్బంది లనసూయ, రాజయ్య, వీవోలు పాల్గొన్నారు.

# కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

## మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
   ఎ) EHWYST బి) WEYHTS
   సి) TUSEWJ డి) ఏదీకాదు
2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
   ఎ) LHLEQK బి) LQLKHE
   సి) LELQHK డి) ఏదీకాదు
3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
   ఎ) GZOGMV బి) GMVOZG
   సి) GVOZMG డి) ఏదీకాదు
4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
   ఎ) IPPQT బి) IPTQP
   సి) UQOTO డి) ఏదీకాదు
5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
   ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు
6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
   ఎ) CHUSPNL బి) HNCPLHU
   సి) CNHUSPL డి) ఏదీకాదు

**7 - 10**

ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి


7. NOSE కు సరైన కోడ్?
   ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు
8. AIM కు సరైన కోడ్?
   ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు
9. MIND కు సరైన కోడ్?
   ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు
10. HOME కు సరైన కోడ్?
   ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు
11. 6, 7, 16, 51, ---------
   ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు
12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
   ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు
13. 8, 3, 2, 3, 10, --------
   ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు
14. 5, 4, 6, 15, 56, -------
   ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు
15. 9, 15, 43, 83, 247, -----------
   ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు
16. a - bc - ab - cdabc - da - cd - ----
   ఎ) abbcdd బి) adbcbd
   సి) abcdbd డి) ఏదీకాదు
17. ab - b - cacc - b - a - cb
   ఎ) cbaab బి) aabbc
   సి) adcab డి) ఏదీకాదు
18. d - dba - a - db - - a - ac
   ఎ) bcdbcc బి) bbcccd
   సి) bccdbc డి) ఏదీకాదు
19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
   అన్ని రాష్ట్రాలు దేశాలు
   సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
   2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
   3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
   4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
   ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
   సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు
20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు
   కొన్ని నిమిషాలు గంటలు
   సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
   2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
   3. కొన్ని గంటలు నిమిషాలు
   4. అన్ని సెకన్లు గంటలు
   ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
   సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు




Panditi Meenakshi Pavan
Senior Faculty

**Competitive Exams Special**

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



   ఎ) 20 బి) 22 సి) 18 డి) 14
22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?



   ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

**23 - 25**

భిన్నమైనదాన్ని తెలపండి

23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH


**26 - 30**

A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B

పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి


26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
   ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
   సి) D మేనకోడలు A డి) ఏదీకాదు
27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
   ఎ) A మామగారు C బి) D భర్త C
   సి)D కుమార్తె B డి) A తండ్రి D
28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
   ఎ) A కోడలు C బి) C భార్య B
   సి) B భర్త C డి) C మామగారుA
29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
   ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
   సి) A తండ్రి D డి) D భర్త C
30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
   ఎ) D కోడలు B బి) C అత్తగారు A
   సి) C తండ్రి D డి) D తండ్రి C
31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
   ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు
32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
   1. Honey 2. Heart 3. Home
   4. Health 5. Help
   ఎ) Help బి) Home
   సి) Heart డి) Honey
33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
   ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు
34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
   ఎ) JaNuaRy బి)JANuary
   సి) JAnuARy డి) ఏదీకాదు
35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
   ఎ)A బి) B సి) O డి) N
36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
   ఎ) L బి) M సి) N డి) P

(37-40)




పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి

37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను
41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?




   ఎ) 5 బి) 6 సి) 3 డి) 1
42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
   ఎ) నవంబరు బి) అక్టోబరు
   సి) జనవరి డి) డిసెంబరు

### సమాధానాలు

| | | |
|---|---|---|
| 1) ఎ | 7) ఎ | 13) ఎ |
| 2) సి | 8) సి | 14) బి |
| 3) బి | 9) ఎ | 15) సి |
| 4) సి | 10) బి | 16) బి |
| 5) ఎ | 11) ఎ | 17) ఎ |
| 6) సి | 12) బి | 18) సి |

| | | |
|---|---|---|
| 19) ఎ | 27) సి | 35) బి |
| 20) సి | 28) ఎ | 36) సి |
| 21) బి | 29) సి | 37) బి |
| 22) బి | 30) ఎ | 38) డి |
| 23) డి | 31) బి | 39) సి |
| 24) సి | 32) బి | 40) ఎ |
| 25) బి | 33) సి | 41) బి |
| 26) ఎ | 34) ఎ | 42) డి |

## ఉద్యోగాలు

### ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

**మొత్తం ఖాళీలు :** 57

**విభాగాలవారీ ఖాళీలు:** అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థొరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1

**వయసు:** ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు

**అర్హత:** ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.

**దరఖాస్తు ఫీజు:** రూ.500

**ఇంటర్వ్యూ:** ఆగస్టు 21 నుంచి 24 వరకు

**వేదిక:** Office Chamber of the Director, IGIMS, Patna - 14

**వెబ్‌సైట్:** www.igims.org

### షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

**సీట్లు:** 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)

**క్యాంపస్:** SCI' Maritime Training Institute, Powai, Mumbai

**కోర్సు ఫీజు:** రూ.4,50,000

**స్టయిపెండ్:** నెలకు రూ.15,000 ఇస్తారు

**అర్హత:** 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

**వయసు:** అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు

**ఎంపిక:** ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

**ఆన్‌లైన్ టెస్ట్:** సెప్టెంబరు 9న

**ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు:** పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.

**పరీక్ష కేంద్రాలు:** ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై

**దరఖాస్తు ఫీజు:** రూ.1000

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 23

**దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 25

**చిరునామా:** Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021

**వెబ్‌సైట్:** www.shipindia.com/careers

# గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?

## జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హివియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియ డి) హివియా

7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం




8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిలాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ............
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) ఆబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ...........
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

## జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతినామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు

26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 35.9°C
బి) 25°C
సి) 42.9°C డి) 51°C



27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 125°F బి) 84 - 92°F
సి) 100 - 102.5°F డి) 110 - 114°F
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 99.5° - 101,5°F బి) 82° - 85°F
సి) 74.3° - 76.5°F డి) 105° - 107°F
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా

35. 'గుడ్లగూబ' ఒక ........
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) అకశేరుకం



36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపొడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) అకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువులో రథనికలు, అగ్ర చర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డేవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.
1. ఉల్లి ఎ. కొమ్ము
2. బంగాళదుంప బి. లశునం
3. అల్లం సి. దుంపకాండం
డి. కందం
ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?
మొక్క - క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి - 16
2. వరి - 24
3. యాపిల్ - 34
ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

### సమాధానాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) ఎ | 9) సి | 17) డి | 27) సి | 37) ఎ | 47) సి |
| 2) డి | 10) ఎ | 18) ఎ | 28) ఎ | 38) డి | 48) డి |
| 3) సి | 11) బి | 19) సి | 29) సి | 39) బి | 49) డి |
| 4) డి | 12) బి | 20) సి | 30) ఎ | 40) ఎ | 50) ఎ |
| 5) బి | 13) బి | 21) బి | 31) బి | 41) బి | 51) డి |
| 6) బి | 14) బి | 22) ఎ | 32) డి | 42) ఎ | 52) బి |
| 7) ఎ | 15) ఎ | 23) డి | 33) బి | 43) సి | 53) డి |
| 8) బి | 16) సి | 24) సి | 34) సి | 44) ఎ | 54) ఎ |
| | | 25) సి | 35) ఎ | 45) ఎ | 55) సి |
| | | 26) ఎ | 36) సి | 46) సి | |



## అడ్మిషన్స్

### ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
**ఆఫర్ చేస్తున్న కోర్సులు:** ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
**ప్రవేశం:** రాత పరీక్ష ద్వారా
**ఎంబిఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)**
**ప్రవేశం:** టిఎస్ఐసెట్-2017 ద్వారా
**దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11, 2017
**రాత పరీక్ష తేదీ:** ఆగస్టు 13, 2017
**వెబ్‌సైట్:** http://www.ouadmissions.com/

### సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
**అర్హత:** ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
**వయసు:** 17-25 సంవత్సరాలు
**దరఖాస్తు:** సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డిడిని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
**దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16, 2017
**చిరునామా:** సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
**పిన్:** 500028.

### బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
**సీట్ల సంఖ్య:** 30
**అర్హత:** 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
**వయసు:** 26 సంవత్సరాలు
**దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
**దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21, 2017
**రాత పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 3, 2017
**వెబ్‌సైట్:** http://www.barc.gov.in/

### జెఎన్‌టియు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)-హైదరాబాద్, ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
**సీట్ల సంఖ్య:** 20
**అర్హత:** 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.1,000
**ప్రవేశం:** రాత పరీక్ష ద్వారా
**దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10, 2017
**వెబ్‌సైట్:** http://jntuh.ac.in/admissions
**చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్, జెఎన్‌టియూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

## స్కాలర్‌షిప్

### రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన **'మెరిట్ స్కాలర్‌షిప్స్'**నకు ప్రకటన విడుల చేసింది. ఇందుకు ఎంహెచ్ఆర్‌డి సహకారాన్ని అందిస్తోంది.
శాన్‌స్క్రిట్/ పాళి/ ప్రాకృత్‌లను మెయిన్/ ఆప్షనల్ సబ్జెక్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహా విద్యాలయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నవారు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవత్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బిఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పిహెచ్‌డి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
**విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ:** ఆగస్టు 30
**అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 10
**వెబ్‌సైట్:** www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

## రాష్ట్రపతిని కలిసిన ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు

- స్పీకర్ కార్యాలయంలో సిస్టర్ ఫర్ చేంజ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ
- నితిన్‌గడ్కరీని కలిసిన నేతలు



రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

జిల్లా అభివృద్ధికి సహకరించండి. పార్లమెంట్ పరిధిలోని రోడ్లకు నిధులు ఇవ్వండి. ప్రమాదాలు జరుగకుండా రక్షాబంధన్ రోజున అన్నదమ్ములకు హెల్మెట్‌లు అందించండని ఎంపీ కవిత ఢిల్లీలో శుక్రవారం పలువురిని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రతినిధులతో కలిసి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలను రాష్ట్రపతికి ఎంపీ కవిత పరిచయం చేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను ఆమె కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సిస్టర్ ఫర్ చేంజ్ వెబ్‌సైట్‌ను లోక్‌సభ స్పీకర్ ప్రారంభించారు. రాఖీ పండుగ సందర్భంగా ఆడపిల్లలంతా అన్నదమ్ములకు హెల్మెట్‌లు పంపిణీ చేయడం మంచి కార్యక్రమమని స్పీకర్ కొనియాడారు. ప్రమాదం నుంచి బయటపడేందుకు హెల్మెట్ ధరించాలని ప్రచారం చేయడంతో వాహనదారులకు అవగాహన కలుగుతుందన్నారు. తప్పనిసరిగా వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆమె కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని రోడ్లకు నిధులు విడుదల చేయాలని కేంద్ర రోడ్లు, హైవేస్, షిప్పింగ్ శాఖల మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి, తన పార్లమెంట్ పరిధిలో ఉన్న రోడ్ల పరిస్థితిని వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, ధర్మపురి, కరీంనగర్, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కల్పించాలన్నారు. ధర్మపురి నుంచి చెలిగల్, కొలాస వరకు జగిత్యాల్‌లో బైపాస్ రోడ్డును నిర్మించాలని కోరారు. చెలిగల్, అంతర్గామ్ మీదుగా దరూర్ వరకు నిజామాబాద్, కరీంనగర్ రోడ్లను కలిపే విధంగా బైపాస్ రోడ్‌ను వేయాలని కోరారు. నేషనల్ హైవే 563ను కలిపే విధంగా హైవేస్ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం చేయాలని కోరారు. రాఖీ పండుగ రోజునే హెల్మెట్ ఇవ్వడంతో ప్రచారం బాగా జరుగుతుందని ఈ నిర్ణయం తీసుకున్నానని ఎంపీ కవిత తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదంలో 400 మందికిపైగా ద్విచక్ర వాహనదారులు చనిపోతున్నారని ఆమె తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ పెట్టుకోని వారే మృత్యువాతపడుతున్నారని, దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకే సిస్టర్‌ఫర్ చేంజ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తన పిలుపునకు సోషల్ మీడియాతోపాటు ప్రజల్లో అవగాహన వస్తుందన్నారు. ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, షకీల్, విద్యాసాగర్‌రావు, జగిత్యాల ఇన్‌చార్జి డాక్టర్ సంజయ్‌కుమార్ తదితరులున్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



వాసవీ కన్యకా పరమేశ్వరికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హమాలివాడి సంతోషిమాత ఆలయంలో భక్తుల పూజలు

**నిజామాబాద్ కల్చరల్:** వరలక్ష్మీ మాతా నమో నమః మా పాలిట కల్పతరువుగా ఉండి సిరిసంపదలను కలిగించు తల్లీ అని సుహాసినులు వేడుకున్నారు. ఉమ్మడి జిల్లా అంతటా శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, మోపాల్, కామారెడ్డి, జక్రాన్‌పల్లి, బాన్సువాడ మండల పరిధి గ్రామాల్లో ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణమాసం రెండో శుక్రవారం రోజున భక్తులు వరలక్ష్మీ వ్రతం జరుపుకొంటారు. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ సుహాసినులు వరలక్ష్మీ దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. సకల శుభాలు, అష్టైశ్వర్యాలను అందించే తల్లియైన మహాలక్ష్మిని శుక్రవారం విశేషంగా పూజిస్తే మంచిదని పండితులు పేర్కొనటంతో సుహాసినులు వరలక్ష్మీ వత్రాలను ఆచరించారు. శ్రావణమాస శుక్రవారానికి తోడు సరస్వతీ అమ్మవారి నక్షత్రమైన మూల ఉండడంతో భక్తులు లక్ష్మీ, సరస్వతీ, గౌరీ ముగ్గురమ్మలకు విశేషంగా పూజలు జరిపారు. ఒకేరోజు ముగ్గురమ్మలను పూజించడంపట్ల మహిళల్లో ఆనందం వెల్లివిరిసింది. సుహాసినులు ప్రత్యేకంగా అలంకరించుకున్న పీఠంపై ముందుగా కలశ స్థాపన, గణపతి పూజను నిర్వహించారు. బంగారం, వెండి, పంచలోహాలతో తయారుచేసిన మహాలక్ష్మి ప్రతిమను పంచామృతంతో అభిషేకించారు. పూలు, అష్టోత్తర శతనామాలతో అమ్మవారిని పూజించారు. బెల్లం, చక్కెర, నెయ్యి వంటి వాటితో తయారుచేసిన నైవేద్యాన్ని అమ్మవారికి నివేదించారు. తమ తోటి సుహాసినులకు తమలపాకు, అరటిపండ్లు, నానబెట్టిన శనగలు, వక్కపొడి, బియ్యంపిండితో తయారుచేసిన ప్రసాదాలను వాయనంగా సమర్పించుకున్నారు. అనంతరం అమ్మ విశిష్టతను తెలుపు కథలు, భజనలతో కీర్తించారు. నగరంలోని దుబ్బలోని మహాలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ఆలయ పూజారి రాజగోపాలాచార్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సేనాపతి శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దేవిరోడ్డులోని దేవీమాత ఆలయంలో అర్చకులు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చనలు జరిగాయి. అలాగే జిల్లాలోని వివిధ దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దేవాలయాలన్నీ ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి.

**వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో..**

నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో సాముహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపారు. అర్చకులు వేలేటి గౌరి శంకరశర్మ సుహాసినులచే కలశ, గణపతి, గౌరీ, మహలక్ష్మీ పూజలను జరిపించారు. సుహాసినులకు వ్రత ప్రాశస్థాన్ని వివరించారు. అమ్మవారికి సుహాసినులు నైవేద్యాలను సమర్పించుకున్నారు. సాముహిక వరలక్ష్మీ వ్రతంలో 500 మందికి పైగా సుహాసినులు పాల్గొన్నారు.

**కరెన్సీతో సంతోషిమాతకు అలంకరణ**

నాందేవ్‌వాడ సంతోషిమాత దేవాలయంలో సంతోషిమాతను కరెన్సీతో అలంకరించారు. వరలక్ష్మీ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ, సుభాష్‌శర్మ అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి పది గజాల చీర, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. నవంబరులో నోట్లు రద్దయిన అనంతరం మొట్టమొదటిసారిగా కొత్తనోట్లతో అమ్మవారిని అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళలచే సాముహిక వరలక్ష్మీ వ్రతాలను ఆలయ అర్చకులు సుభాష్‌శర్మ జరిపించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఇసుక మాఫియా ప్రభుత్వం కొనసాగుతోంది

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



రైతు పంచాయతీ సభలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

**సిరికొండ:** రాష్ట్రంలో ఇసుక మాఫియా ప్రభుత్వ పాలన సాగుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు విమర్శించారు. సిరికొండ మండలం గడ్కోల్‌లో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేశ్‌పల్లి ఆనంద్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన పంచాయతీ సభలో రైతులనుద్దేశించి మురళీధర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎంతో సుభిక్షంగా ఉంటామని భావించిన ప్రజలకు మూడేళ్లలో టీఆర్‌ఎస్ సర్కార్ అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు జరిగి ఆనందంగా ఉంటామనుకున్న ప్రజలు నియంత, నిరంకుశ పాలనలో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కంటే ఇసుక మాఫియా, నియంత పాలన సాగుతుందని విమర్శించారు. ఇసుక లారీల కిందపడి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటుంటే అడ్డుకోవాల్సిన ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. దళితులు, బడుగు, బలహీనవర్గాలవారని చూడకుండా పోలీసులు చావబాదుతున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కోట్ల నిధులు విడుదల చేస్తున్నా, రాష్ట్ర సర్కార్ మాత్రం రైతుల క్షేమాన్ని మరిచిపోయిందన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన గుర్తు చేశారు. కరువు కాటకాలు సంభవించి రైతులు నష్టపోతే ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకువస్తే, రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చెల్లించాల్సిన ప్రీమియం బీమా కంపెనీలకు చెల్లించకపోవడంతోనే పంటల బీమా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పేదలకు ఇల్లు నిర్మించేందుకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే రాష్ట్రంలో నిర్మించింది కేవలం 1400 మాత్రమేనని వివరించారు. మిషన్ భగీరథ కాస్తా కమీషన్ భగీరథగా మారిందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవసాయరంగం అభివృద్ధి సూచీ 6 నుంచి 21 శాతానికి వృద్ధి చెందిందన్నారు. సమావేశంలో శాసనసభా పక్ష మాజీ నేత ఎండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జాపూర్ శ్రీనివాస్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటపాటి నర్సింహనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, బాగారెడ్డి, నచ్చు రాజన్న, బాగారెడ్డి, రాజేశ్వర్, లింబాద్రి గౌడ్, జిల్లా, రాష్ట్ర నాయకులు ఆలూర్ గంగారెడ్డి, అమృతలతారెడ్డి, కమలాకర్‌రెడ్డి, హన్మంత్ రెడ్డి బొర్రన్న, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉన్నత విద్యామండలి పాలకమండలి సభ్యుడిగా ప్రొ.శివశంకర్



వర్సిటీలో టీయూ మాజీ రిజిస్ట్రార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

**డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే.శివశంకర్ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి పాలకమండలి సభ్యునిగా నియమితులయ్యారు. సేత్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్‌లోని కీలకమైన పాలకమండలి సభ్యునిగా ప్రొఫెసర్ శివశంకర్ నియామకం పట్ల టీయూ అధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత విద్య, ప్రభుత్వ విధానాల అమలులో పాలకమండలి పాత్ర నిర్ణయాత్మకం. ఈ పదవిలో మూడేళ్లపాటు ఆయన కొనసాగుతారు. తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతను అప్పగించినందుకు శివశంకర్ సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీయూలోని వివిధ కళాశాలల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది శివశంకర్‌ను శాలువ, పూలమాలలతో సన్మానించారు. లా కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, మహిళా సెల్ డైరెక్టర్ త్రివేణి, కామర్స్ డీన్ యాదగిరి, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ నసీం, ఎల్లోసా, ఏసీలు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ శిక్షణను పరిశీలించిన అంతర్జాతీయ క్రీడాకారుడు

**డిచ్‌పల్లి:** మండలంలోని యానంపల్లి, సుద్దపల్లి శివారు గురుకుల పాఠశాలలో అండర్ 10, 12 సాఫ్ట్‌బాల్ శిక్షణా కేంద్రాన్ని సాఫ్ట్‌బాల్ అసిస్టెంట్ కార్యదర్శి, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు శోభన్‌బాబు శుక్రవారం పర్యవేక్షించారు. క్రీడాకారులకు బ్యాటింగ్, బౌలింగ్ కోచింగ్ వంటి మెలకువలను ఆయన నేర్పించారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత ఈ జట్టు ఈ నెల 9 నుంచి 11 వరకు నెల్లూరు జిల్లాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభాకర్, గంగామోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజినిదేవి, పీడీ నీరజ ఉన్నారు.

## నగరంలో ఘనంగా వరలక్ష్మీ పూజలు

**నిజామాబాద్ కల్చరల్:** నగరంలోని ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ధనలక్ష్మీ, అష్టలక్ష్మీ రూపంలో ఉన్న అమ్మను కొలిచి భక్తి పూర్వకంగా పాయసం, బోంది లడ్డు, కొబ్బరి కాయలను సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు. సుహాసినులు ముత్తైదులకు తమలపాకు, పోకలు, అరటిపండ్లు, పచ్చి ధాన్యాలను వాయినాలుగా ఇచ్చుకున్నారు. పలు ఆలయాల్లో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో సుహాసినులు పాల్గొని పూజలు జరిపారు. నగరంలోని అశోక్‌నగర్‌లో గల మహాలక్ష్మీ, దుబ్బ మహాలక్ష్మీ దేవాలయం, ముబారక్‌నగర్ పెద్దమ్మ దేవాలయం తదితర ఆలయాల్లో వరలక్ష్మీ పూజలు చేశారు.

# రాహుల్‌గాంధీపై దాడికి నిరసనగా కాంగ్రెస్ ఆందోళనలు



రైల్వే కమాన్ వద్ద రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాజరాజేంద్ర చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**నిజామాబాద్ అర్బన్:** గుజరాత్‌లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై బీజేపీ గుం డాల దాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా శుక్ర వారం కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పీసీసీ కార్యదర్శి రత్నాకర్ ఆధ్వర్యంలో రైల్వేకమాన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రాహుల్‌గాంధీపై దాడి చేయడం బీజేపీ గుండాయిజానికి నిదర్శనమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దాడులు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేశారు. మూడో టౌన్ పోలీసులు నాయకులను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమీర్ హైమద్, ఫయాజ్, రఘు, పప్పాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

### యువజన కాంగ్రెస్ ఆందోళన

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బంటు రాము ఆధ్వర్యంలో రాహుల్ గాంధీపై దాడికి నిరసనగా శుక్రవారం నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన రాహుల్ గాంధీపై దాడులు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ రచయితల సంఘ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

**నిజామాబాద్ కల్చరల్:** తెలంగాణ రచయితల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘ జిల్లా అధ్యక్షుడిగా నరాల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా చింతల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దశరథ్ కోత్మీర్‌కర్, యెండల నరసింహులు, మొగిలి స్వామిరాజ్‌లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ప్రవీన్ తాడూరి, హన్మండ్లు, వెంకన్నగారి జ్యోతి, అధికార ప్రతినిధిగా సాయిబాబా, సాంస్కృతిక కార్యదర్శులుగా సాయి లవోలాలను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహణ కార్యదర్శిగా రామావత్ కిరణ్, సలహాదారులుగా చందన్‌రావు, మాలవత్ చిన్నయ్య, శారదలక్ష్మణ్, సురేశ్, కార్యవర్గ సభ్యులుగా సుజాత, సాయిప్రసాద్, విజయలక్ష్మీ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ త్రివేణి ప్రకటించారు.

## మంచాల జ్ఞానేందర్‌కు మహానటి సావిత్రి సేవా రత్న పురస్కారం

**నిజామాబాద్ కల్చరల్:** సమాజ సేవలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న జిల్లా కేంద్రానికి చెందిన జ్ఞానేందర్‌కు మహానటి సావిత్రి సేవా రత్న పురస్కారం అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంచాల జ్ఞానేందర్‌కు ప్రముఖ నటి వాణిశ్రీ చేతుల మీదుగా సేవా రత్న పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యురాలు నన్నపనేని రాజకుమారి, తుర్లపాటి కుటుంబరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బొలిశెట్టి రాధకృష్ణమూర్తి, గంటశాల ప్రవీణ్‌కుమార్, జమున తదితరులు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న మంచాల జ్ఞానేందర్

## మహిళలు రక్తదానం చేయడం అభినందనీయం

### ◆ ఏసీపీ ఆనంద్‌కుమార్

**పెద్దబజార్:** పురుషులతో పాటు మహిళలు రక్తదానం చేయడం అభినందనీయమని ఏసీపీ ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని హైదరాబాద్ రోడ్డులో గల ఐడియా షోరుంపై 1వ అంతస్తులో రెడ్‌క్రాస్ సొసైటీ ఇందూరు బ్లడ్ ఐడియా షోరూం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిపి ఆనంద్‌కుమార్. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటి ఇందూరు బ్లడ్ సంస్థలవారు వారిలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన సభ్యులకు సన్మానం చేయడం గొప్ప విషయమని వారిని యువకులు, ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అన్ని దానాల్లో రక్తదానం చేయడం తోటి వారి ప్రాణాలను కాపాడడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి బిసి సంక్షేమ సంఘం నాయకులు నరాల సుధాకర్, ఆంజనేయులు, సాగర్, ఐడియా షోరూం రక్తదానం సిబ్బంది పాల్గొన్నారు.

## 'పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి'



మొక్కలు నాటుతున్న దృశ్యం

**పెద్దబజార్:** కాలుష్య నియంత్రణ చేపట్టడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని కార్పొరేటర్ సూదం లక్ష్మీ అన్నారు. శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్‌లో హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్టు బొట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ నాగేశ్వర్ చేతులమీదుగా మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 13వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

**నిజామాబాద్ అర్బన్:** ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 13వ రోజుకు చేరాయి. జాతీయ నాయకులు మానికొల్ల గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగళ్ల శ్యామ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. 13వ రోజు దీక్షకు పడకల్ గ్రామం నుంచి ఎంఆర్‌పీఎస్ నాయకులు వచ్చారు.

## బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నవాతే ప్రతాప్

**నిజామాబాద్ అర్బన్:** బీసీ సంఘం విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నవాతే ప్రతాప్‌ను ఆర్.కృష్ణయ్య నియమించారు. ఇప్పటి నుంచి నిజామాబాద్ అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతాప్ కీలకంగా వ్యవహరించారని కృష్ణయ్య తెలిపారు. బీసీ ఉద్యమ పటిష్టత కోసం ఆయనను నియమించినట్లు తెలిపారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకులు, యువజన సంఘం అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

## మాణిక్‌భవన్ పాఠశాలలో ఘనంగా శ్రావణ శుక్రవారం వేడుకలు

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని మాణిక్‌భవన్ పాఠశాలలో గురువారం శ్రావణ శుక్రవారం విశిష్టతను తెలుపుతూ విద్యార్థుల సమక్షంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి దేవీ అనుగ్రహం పొందాలని పూజలు చేశారు. విద్యార్థినులకు కుంకుమ, పసుపు, పారాణి, గంధం రాస్తూ ఎంతో ఆనందంగా పూజలు సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గం అధ్యక్షుడు శ్రీ మోటూరి మురళిగుప్త, ప్రధాన కార్యదర్శి శ్రీ రావులపల్లి జగదీశ్వర్‌రావుగుప్త, విద్యా విషయక కన్వీనర్ శ్రీ మోటూరి లక్ష్మణ్, పాఠశాల ప్రిన్సిపాల్ చందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'రాఖీ పౌర్ణమి రోజున జంజిరాలు ధరించాలి'

**నిజామాబాద్ కల్చరల్:** ఈ నెల 7వ తేదీన సోమవారం శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి)ని పురస్కరించుకొని ఉదయం 10.30లోపు తప్పనిసరిగా జంజిరాలు ధరించి, రాఖీలు లేదా గోండాలను కట్టు కోవాలని జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజున చంద్రగ్రహణం ఉన్నందున సోమవారం వేసుకున్న జంజిరాన్ని మంగళ వారం తీసివేసి నూతన జంజిరాన్ని ధరించాలన్నారు. సంవత్సరంలో ఎప్పుడైనా ఇలా గ్రహణం ఏర్పడినప్పుడు ఇదే పద్ధతి పాటించాలని పండితులు, సిద్ధాంతులు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా సోమవారం చేనేత దినోత్సవం సందర్భంగా అందరూ తప్పనిసరిగా చేనేత దుస్తులను ధరించాలన్నారు.

## 11న ఇన్‌స్పైరింగ్ ఉమెన్స్ అవార్డు కార్యక్రమం

**సుభాష్‌నగర్:** నగరంలో ఈనెల 11న ఇన్‌స్పైరింగ్ ఉమెన్స్ అవార్డు ఇంటర్నేషనల్ కార్యక్రమాన్ని చిత్రపురి ఫిల్మీంఫెస్టివల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కార్తిక్ సుంకరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వారి రంగాల్లో ప్రాముఖ్యత సాధించిన మహిళలకు సత్కారం చేస్తామని తెలిపారు. 19 దేశాల నుంచి మహిళలను ఎంపిక చేశామని తెలిపారు. మొట్ట మొదటి సారిగా ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామని సంస్థ సీఈవో కె.శ్రావణి ఒక ప్రకటనలో తెలిపారు.

## 'మార్కెట్ కమిటీ ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలి'

**నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ మార్కెట్ కమిటీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కులాచారి దివ్య అధికారులను కోరారు. శుక్రవారం మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డులో, మార్కెట్ కమిటీ ప్రకటిత ప్రాంత పరిధిలో, వివిధ మండలాల్లో చేపట్టవల్సిన పనులపై చర్చించారు. ఈ సమావేశంలో మేయర్ ఆకుల సుజాత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పృథ్విరాజ్, బిల్లా మహేష్, జుగల్ కిశోర్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, అబ్దుల్ అలీం కమర్, శ్రీధర్, కమల్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, సభ్యులు

## కొండూర్ గ్రామాభివృద్ధికి రూ.17 లక్షలు మంజూరు

**సిరికొండ :** కొండూర్ గ్రామాభి వృద్ధికి ఎమ్మెల్సీ డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి 17 లక్షలు మంజూరు చేస్తూ మంజూరు పత్రాలను సర్పంచ్ లస్నం దశరథ్ రెడ్డి, గ్రామాభివృద్ధి సంఘం సభ్యులకు అందజేశారు. శ్మశాన వాటిక నిర్మాణానికి 12లక్షలు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి మరో ఐదు లక్షలు మంజూరు ఎమ్మెల్సీ భూపతిరెడ్డి మంజూరు చేశారని సర్పంచ్ దశరథ్‌రెడ్డి చెప్పారు. సర్పంచ్‌తో పాటు గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు నిమ్మపల్లి చిన్న రాములు, టీఆర్ఎస్ జిల్లా నాయకులు మిద్దెల రవీందర్‌రెడ్డి, సల్లా మురళి, గోగు నరేష్, మల్కీ రమేష్,గంగాసాయులు, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యాక్షులు చెల్లెం గంగాయ్య పాల్గొన్నారు.



మంత్రి తలసానితో ఎంపీపీ

## మంత్రి తలసానిని కలిసిన ఎంపీపీ

**ధర్పల్లి:** రాష్ట్రంలోని చెరువుల్లో గూండ్ల, బేస్తా, ముదిరాజ్ కులస్తులకు సభ్యత్వం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు, ధర్పల్లి ఎంపీపీ గోపి మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సచివాలయంలో కలిశారు. మత్స్య శాఖపై సబ్ కమిటీ సమావేశం శుక్రవారం ఉన్నందున ఈ సమావేశంలో రాష్ట్రంలోని ముదిరాజ్, బేస్తా, గూండ్ల కులస్థులకు చెరువుల్లో సభ్యత్వం కల్పించేవిధంగా కమిటీలో నిర్ణయిస్తామని మంత్రి చెప్పినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. ముదిరాజ్‌లకు చెరువుల్లో సభ్యత్వం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ముదిరాజ్‌లకు చెరువుల్లో సభ్యత్వం కల్పించడంతో పాటు సంఘాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కృతనిశ్చయంతో ఉందని ఎంపీపీ చెప్పారు. సబ్ కమిటీ అధ్యక్షుడిగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ఐదుగురు మంత్రులు ఉన్నారన్నారు. కమిటీ సూచన మేరకు సభ్యత్వం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, జిల్లా ముదిరాజ్‌లు ఉన్నారు.

## శివశంకర్‌ను అభినందించిన వీసీ

**డిచ్‌పల్లి:** తెలంగాణ ఉన్నత విద్యామండలి ఈసీ మెంబర్‌గా యూనివర్సిటి మాజీ రిజిస్టర్ కె.శివశంకర్ నియమితులు కావడం తెలంగాణ యూనివర్సిటీకే గర్వకారణమని వీసీ సాంబయ్య అన్నారు. శుక్రవారం శివశంకర్‌ను ఉన్నత విద్యా మండలి సభ్యుడిగా నియమించి ఉన్నత విద్య నాణ్యత ప్రమాణాలు పెంచడంలో భాగస్వాములు చేయడం అభినందనీయం అని సాంబయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివశంకర్‌కు వీసీ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. యూనివర్సిటి అభివృద్ధికి కొత్త పదవి ద్వారా మరింత కృషి చేయాలని వీసి సూచించారు. వర్సిటీ అభివృద్ధి కోసం తప్పకుండా కృషి చేస్తానని శివశంకర్ హామీ ఇచ్చారు.

### శివశంకర్‌ను సన్మానించిన పూర్వ విద్యార్థులు

టీయూ మాజీ రిజిస్ట్రార్‌ను ఉన్నత విద్యామండలి పాలకమండలి సభ్యునిగా నియమించడంపై యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు పుప్పాల రవి, శ్రీకాంత్‌లు శివశంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం శివశంకర్ ప్రత్యేక చొరవతో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### టీయూకు చెందిన ఇద్దరికి కీలక పదవులు

తెలంగాణ యూనివర్సిటిలో రిజిస్టర్‌గా పనిచేసి ఇటీవలే ఉస్మానియా యూనివర్సిటికి వెళ్ళిన ప్రొఫేసర్ లింబాద్రికి ఉన్నత విద్యా మండలిలో తెలంగాణ ప్రభుత్వం వీసి పదవిని కట్టబెట్టగా మాజీ రిజిస్ట్రార్ కె.శివశంకర్‌కు ఉన్నత విద్యామండలి పాలకమండలిలో ఈసీ మెంబర్‌గా నియమించడంతో యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు అభినందిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో పనిచే సిన ఇద్దరికి ఉన్నత విద్యామండలిలో కీలకపదవులు రావడంతో అందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాల కోసం గోపాల కాలువను ఎక్కిన యువకులు

**డిచ్‌పల్లి:** ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో వర్షాల కోసం వీడీసీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ యువకులు హనుమాన్ మందిరం వద్ద 60 అడుగుల ఎత్తులో ఉన్న భారీ కర్రను పాకుతూ ఉట్టిలను ధ్వంసం చేశారు. వర్షాకాలంలో ఈ గోపాల కాలువను తాకడం వల్ల వర్షా లు సమృద్ధిగా కురుస్తాయని ప్రతీ యేటా ఈ కర్రను పాకడం జరుగుతుం దని వీడీసీ కమిటీ సభ్యులు తెలిపారు. మొన్న కప్ప తల్లితో ఆటలు, నిన్న సప్త భజనలు వీడీసీ కమిటీ ఆధ్వర్యంలో వర్షాల కోసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



ఖిల్లా డిచ్‌పల్లిలో గోపాల కాలువ కర్రను పాకుతున్న దృశ్యం

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

◆ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**నిజామాబాద్ రూరల్:** మండలంలోని ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, కాలూరు, ఖానాపూర్, లక్ష్మాపూర్‌లలోని ఆలయాలు వరలక్ష్మీవ్రతం సందర్భంగా కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం రోజున వరలక్ష్మీవ్రతం చేయడం సాంప్రదాయంగా వస్తుంది. ఆనవాయితీని కొనసాగిస్తూ మహిళలు, ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వ్రతాలు నిర్వహించారు. మహిళలను ఇండ్లలోకి ముత్తయిదువుగా పిలిచి వాయినాలు సమర్పించారు. సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో..**

**డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో శుక్రవారం సుహాసినిలు వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. లక్ష్మీదేవిని అందంగా అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

**మహిళా లోకానికి పెద్ద పండుగ**

**- జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సుమనరెడ్డి**

**ధర్పల్లి:** వరలక్ష్మీ వ్రతం మహిళా లోకానికి పెద్ద పండుగ అని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సుమన రెడ్డి అన్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంతో సకల శుభాలు కలుగుతాయని మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన పండగ ఇదే అన్నారు. శ్రావణమాసంలో రెండవ శుక్రవారం రోజున వచ్చే వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో వరలక్ష్మిని ఆరాదిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆమె టీఆర్ఎస్ మహిళ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలందరూ సుఖశాంతులతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సుమనరెడ్డి

## కొత్తపేట చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**నిజామాబాద్ రూరల్:** కాంగ్రెస్ పార్టీపై సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట్ ప్రధాన రోడ్డు మీద ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కొత్తపేట్ రోడ్డుపై యూత్ కాంగ్రెస్ నేతలు 100 మందితో రాస్తారోకో చేశారు. నిజామాబాద్-వర్ని వెళ్లే వాహనాలను అరగంట పాటు నిలిపివేశారు. రోడ్డుపై బైఠాయించి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం టీపీసీసీ కార్యదర్శి గడుగు గంగాదర్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న భయంతో ఏం చేయాలో అర్థం కాని అయోమయస్థితిలో సీఎం ఉన్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ ప్రెసిడెంట్ బంటురాము, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్, మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధప్రసాద్ గౌడ్, అవినాష్, శంకర్, అనీజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సముచిత స్థానం: ఎమ్మెల్సీ వీజీ గౌడ్

**ధర్పల్లి:** టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సముచితస్థానం కల్పిస్తుందని ఎమ్మెల్సీ వీజిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీతాయిపేట్ గ్రామస్థులు సర్పంచ్ భూమేశ్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సన్మానించారు. గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి గాను ఎమ్మెల్సీ నిధుల నుంచి 1.50లక్షలు మంజూరు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్నివర్గాల వారికి ప్రభుత్వం సముచితస్థానం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో కమ్యూనిటి హాల్‌ల నిర్మాణంకోసం నిధులు మంజూరు చేశామన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ కార్యక్రమాల్లో స్థానం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు, ఎస్సీ కులపెద్దలు పాల్గొన్నారు.

## మురళీధర్‌రావుకు ఘన సన్మానం



బీజేపీ జాతీయ కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

**ధర్పల్లి:** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావుకు శుక్రవారం మండలకేంద్రంలో మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో గల గాంధీ విగ్రహం వద్ద మురళీధర్‌రావును స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ దిశలో బీజేపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్, పాల్ది గంగాదాసు, లోలం గంగారెడ్డి, మండల బిజేవైఎం అధ్యక్షుడు ప్రవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**టోల్‌గేట్ వద్ద ఘనస్వాగతం..**

**డిచ్‌పల్లి:** రూరల్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావుకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరు నరేంద్రమోడి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మురళీధర్‌రావు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు గడ్డం ఆనంద్‌రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, ఆలూరు గంగారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, అమృతలక్ష్మి, కేపీ రెడ్డి యాదవ్ ఉన్నారు.

# రెడ్డీలందరూ ఐక్యంగా ఉండాలి

◆ పేద రెడ్డిలను ఆదుకుంటాం
◆ హాజరైన పలువురు నాయకులు

**మోపాల్:** రెడ్డి కులస్తుందరం ఐక్యంతో ఉంటే సాధించుకోలేనిది ఏమీ లేదని వివిధ పార్టీలకు చెందిన రెడ్డి నాయకులు అన్నారు. శుక్రవారం బోర్గాం(పి) మోటాడిరెడ్డి కల్యాణ మండపంలో మోపాల్ మండలం రెడ్డి సంక్షేమ సంఘం సమావేశాన్ని మామిండ్ల సాయిరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. భూంరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ కులంలో సంఘాలను ఏర్పాటు చేసుకుంటారన్నారు. రెడ్డిలు విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో కూడా మరింత రాణించాలన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామ ముత్యంరెడ్డి, సీహెచ్ సుదర్శన్, సూర్యరెడ్డి, గంగారెడ్డి, నారాయణరెడ్డి, ముప్ప శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

**మోపాల్ మండల రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు**

మోపాల్ మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఈగ రమేష్ రెడ్డిని ఎన్నిక చేశారు. ఉపాధ్యక్షులుగా అరికెల నారాయణ రెడ్డి, పృథ్వీరాజ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పెద్దోళ్ల నవీన్ రెడ్డి, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సాయరెడ్డి, గంగారెడ్డి, శ్రవణ్ రెడ్డి, ఏ.సాయిరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా బాపురెడ్డి, సంతోష్‌రెడ్డి, సభ్యులుగా అభిలాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చిన్నోళ్ల నర్సారెడ్డి, బుజేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, చెన్నూరు గంగారెడ్డి, నిమ్మల సాయిరెడ్డి, రాకేష్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఈగ గంగారెడ్డి, అరికెల నర్సారెడ్డి, సంజీవ్ రెడ్డి, భూంరెడ్డి, ముప్ప గంగారెడ్డి, నర్సింహారెడ్డి ఉంటారని గంగారెడ్డి వివరించారు.

హలో..హలో..

కోటగిరి అధికారుల ఫోన్ నెంబర్లు

| | | | | | |
|---|---|---|---|---|---|
| తహసీల్దార్ | 9491036918 | ఏపీవో | 9000102485 | విద్యుత్ ఏఈ | 9440811654 |
| ఎంపీడీవో | 9989050846 | ఎంఈవో | 9392210555 | ఎస్ఐ | 9440795470 |
| ఏడీఏ | 8886613220 | హౌసింగ్ ఏఈ | 7799722964 | ఏఎస్ఐ-1 | 9885448948 |
| ఏపీఎం | 8790990140 | పశువైద్యాధికారి | 7396161012 | ఏఎస్ఐ-2 | 9908661217 |

ఇంటర్వ్యూ

## ఇసుక అక్రమ రవాణ నివారణకు చర్యలు



కృష్ణదత్తు, ఆర్ఐ. కోటగిరి

**ఆంధ్రజ్యోతి:** మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఆర్ఐ:** మండలంలోని సుంకిని, కారేగాం, హంగర్గ, పొతంగల్ గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. రెవెన్యూ కార్యదర్శులను అప్రమత్తం చేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి:** గ్రామాల్లో వీఆర్వోలు స్థానికంగా ఉండటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి?

**ఆర్ఐ:** గ్రామాల్లో వీఆర్వోలు స్థానికంగా ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. స్థానికంగా ఉండని వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం.

**ఆంధ్రజ్యోతి:** మండలంలో రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి?

**ఆర్ఐ:** మండలంలో రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేసేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే తమకు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

- కోటగిరి

లెన్స్‌స్టోరీ

## రోడ్డుపై గుంతలను పూడ్చరూ..



గుంతలో నిలిచిన వర్షపు నీరు

బోధన్ పట్టణంలోని గోశాల ప్రాంతంలోన్నున్న వీక్లీ మార్కెట్ చికెన్ సెంటర్ దుకాణాల సముదాయాల వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు గుంతల్లో నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షపు నీరు గుంతల్లో నిలిచివుండటంతో స్థానిక దుకాణదారులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయనివాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నా రు.

- బోధన్ టౌన్

# సింగూరు జలాలు విడుదల చేసే వరకు ఉద్యమిస్తాం

● బోధన్‌లో కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో.. అరెస్టు



బోధన్‌లో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బోధన్:** సింగూరు జలాలు నిజామాబాద్ జిల్లా రైతుల హక్కని, ఈ జలాలను విడుదల చేసేవరకు ఉద్యమిస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బోధన్ పట్టణంలోని అనిల్‌టాకీస్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సింగూరు జలాలను నిజాంసాగర్ ప్రాజెక్టుకు విడిచిపెట్టకుండా మంత్రి పోచారం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా వ్యవహరిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటలకే తప్పా, ఆచరణలో విఫలమవుతున్నారన్నారు. రైతుల ప్రభుత్వమని చెబుతున్నా, అది ఎక్కడా కనిపించడం లేదన్నారు. సింగూరు జలాలను విడుదల చేయిస్తామని సభలకే పరిమితం చేస్తున్న మంత్రి పోచారం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల గోడును పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు రైతులకు ఎలాంటి న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అది చేస్తుంది, ఇది చేస్తుందని గొప్పలు చెప్పుకోవడం తప్పా, చేసిందేమి లేదన్నారు. స్వార్థ రాజకీయాలను వదిలి రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల, ప్రజాసమస్యల పట్ల కాంగ్రెస్ నిరంతరం ఉద్యమిస్తుందని రైతుల పక్షాన నిలిచి, వారి సమస్యల కోసం పోరాడుతుందన్నారు. వర్షాలు కురవక, సాగర్ నీరులేక వరినాట్లు వేసుకున్న రైతుల పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం కానున్నాయని, భవిష్యత్‌లో రైతులు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా స్థానిక మంత్రి, ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సింగూరు జలాలను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను రాస్తారోకో విరమించాలని కోరగా, వారు వినకపోవడంతో నాయకులను అరెస్టు చేశారు. ఈ ఆందోళనా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీ గంగాశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, గణపతిరెడ్డి, గుణప్రసాద్, పాషామొయినోద్దీన్, అల్లె రమేష్, బిళ్ల రామ్మోహన్, పోతరెడ్డి, నరేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డ రవీందర్‌రెడ్డి, ఖలీల్, విష్ణువర్ధన్‌రెడ్డి, వీరభద్రరావు, సంజీవ్, హన్మంత్‌రెడ్డి, రవిశంకర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన యోగాపీఠ్ సభ్యులు

**నవీపేట:** స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం పతంజలి యోగాపీఠ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పతంజలి సీఈవో ఆచార్య బాలకిషన్‌జీ పుట్టిన రోజులను పురస్కరించుకుని 50 మొక్కలు నాటడం జరిగిందని భారత్ స్వాభిమాన్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు గంజి సాయన్న తెలిపారు. యోగా గురువు రాజశేఖర్, లోకం నర్సయ్య, కొండ ప్రవీణ్‌కుమార్, శివకుమార్, సాయన్న, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాడ్‌బిలోలిలో గొర్రెల పంపిణీ

**రెంజల్:** మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో 11మందికి 200 గొర్రెలను శుక్రవారం అందించినట్లు సర్పంచ్ తెలంగాణ శంకర్ తెలిపారు. గొల్లకుర్మలు ప్రభుత్వ సబ్సిడీ గొర్రెల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్థులు దత్తుపటేల్, కుర్మె సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**ఎడపల్లి:** సామాజిక ప్రజావేదిక ఐక్యసంఘాల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాలకు వ్యతిరేకంగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు జంగం గంగాధర్, సభ్యులు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి నేత్రదానం



**బోధన్:** మండలంలోని పెగడాపల్లి గ్రామానికి చెందిన లయన్స్ సభ్యుడు గోపీనాథ్ తల్లి అయినంపూడి కమలదేవి(87) శుక్రవారం మృతిచెందగా, ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. తన తల్లి కమలాదేవి మృతివార్తను గోపీనాథ్ అందజేయగా, లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి సభ్యులు ఆమె నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. కమలాదేవి మృతి పట్ల లయన్స్ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు రమణారెడ్డి, ఐఆర్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

**కోటగిరి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్న తనిఖీ చేశారు. కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. నవంబరు చివరినాటికి బోధన పూర్తిచేసి విద్యార్థులతో రివిజన్ చేయించాలని సూచించారు. కళాశాలలో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కొత్త అడ్మిషన్లు వస్తే స్వీకరించాలన్నారు. కళాశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గురువరెడ్డి, అధ్యాపకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## 108లో మహిళ ప్రసవం

**వర్ని:** మండలంలోని కోటయ్యక్యాంపు గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం 108 వాహనంలో మహిళ ప్రసవించింది. రుద్రూరు మండలం అంబం (ఆర్) గ్రామానికి చెందిన అనితకు పురిటినొప్పులు రావడంతో 108 ద్వారా వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది రాజు, రవి సిబ్బంది సహకారంతో ఆమెకు చికిత్సలను అందించారు.

## 'మున్నూరుకాపు కల్యాణ మండపం నిర్మించాలి'

**బోధన్:** స్థానికంగా మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపం నిర్మించాలని పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బీర్కూర్ బుజ్జి కోరారు. స్థానిక మహాలక్ష్మీ మందిరం ప్రాంగణంలో శుక్రవారం పట్టణ మున్నూరుకాపు సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. జనాభా ప్రాతిపదికన మున్నూరుకాపులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ బోధన్‌లో మున్నూరు కాపులకు కల్యాణమండపం లేకపోవడం శోచనీయమని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సంతోష్ అన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్‌ను వెయ్యికోట్లతో ఏర్పాటుచేయాలని తీర్మానించారు. మున్నూరుకాపులు ఐక్యతతో ముందుకుసాగాలని, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని, మున్నూరుకాపుల్లో వెనుకబడిన వారి కోసం ఆపన్నహస్తం అందించాలని సూచించారు. మున్నూరుకాపు కుటుంబాలు తమ పిల్లలను విద్యాపరంగా ముందుకు నడిపించాలని, ఉన్నత చదువులను చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగాశంకర్, ప్రధాన కార్యదర్శి మాసుల శ్రీనివాస్, కోశాధికారి బొగ్గుల రవీందర్, మాసుల సాయిలు, ఉద్మీర్ లక్ష్మణ్, ఉద్మీర్ సాయిలు, ఆలూర్ గంగాధర్, ఎంఎల్.బాబు, బీర్కూర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 'తట్టును తరిమేందుకు వ్యాక్సిన్ తప్పనిసరి'



మాట్లాడుతున్న డాక్టర్ సరోజారాణా

**బోధన్ టౌన్:** తట్టువ్యాధిని తరిమేందుకు పదిహేనేళ్లలోపు చిన్నారులకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సభ్యురాలు డాక్టర్ సరోజరాణా సూచించారు. పట్టణంలోని లెర్నర్స్ పాఠశాలలో బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో తట్టు, రుబెల్లా వ్యాధి వ్యాక్సిన్‌పై విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాక్సిన్ తీసుకోకపోవడంతో కలిగే అనర్థాలను, వ్యాక్సిన్ తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఎన్ఎం డాక్టర్ ఆయాశ, వార్డు కౌన్సిలర్ లాయక్అలీ, పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

**నవీపేట:** జిల్లాలోని ఆర్మూర్‌లో లెదర్‌పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం పదికోట్ల రూపాయలను విడుదల చేసినందుకు కృతజ్ఞతగా శుక్రవారం మండల కేంద్రంలో మోచి సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మోచి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవిచందర్ మాట్లాడుతూ, ఆర్మూర్‌లో లెదర్‌పార్కు ఏర్పాటుచేయడం ద్వారా మోచి కులస్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం ఎస్సీ కులస్థులకు ఆర్డీవో ద్వారా కాకుండా మండల కార్యాలయం నుంచే కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, శివకుమార్, రవికుమార్, రాజేందర్, సాయిలు, భూమయ్య, పోశెట్టి, రాజ్‌కుమార్, శంకర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్నిలో ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం

**వర్ని:** మండల కేంద్రంలో శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. గుజరాత్‌లో వరద బాధిత ప్రాంతాలను పరామర్శించేందుకు వెళ్లిన పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీపై బీజేపీ శ్రేణులు దాడిచేశారని ఆరోపిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్రయూత్ కార్యదర్శి కూనిపూర్ రాజిరెడ్డి, మైనారిటీ జిల్లా నాయకుడు మహ్మద్‌భారీ, మాజీ జడ్పీటీసీ రంజ్యానాయక్, వెంకట్‌గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు ముజీబ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరిన ఎస్పీఎం కార్మికుల సమ్మె

**సుభాష్‌నగర్:** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పవర్ హౌజ్ కాంపౌండ్ ఆవరణలో శుక్రవారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాల్లో పనిచేస్తున్న రిపేర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఈఎస్ఐ, ఈపీఎఫ్ సంబంధం లేకుండా క్రమబద్ధీకరించాలన్నారు. రెగ్యూలరైజేషన్ చేయుచున్న 24వేల పోస్టుల్లో ఎస్పీఎంలను కలపాలన్నారు. వయస్సు, విద్యార్హతల సంబంధం లేకుండా పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులను అకారణంగా తొలగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం కార్మికులు పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయం.. ముదిరాజ్ వీధి

**◆ గుంతలరోడ్లతో ఇబ్బందులు ◆ కరువైన పారిశుధ్య పనులు ◆ రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు**



అధ్వానంగా మారిన రహదారి

**పెద్దబజార్:** నగర నడిబొడ్డున ఉన్న కాలనీలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. అధికారులు, పాలకుల చిన్న చూపుతో కాలనీలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. కనీస వసతులకు నోచుకోక కాలనీలో పారిశుధ్యం కనిపించడం లేదు. అతి పురాతమైన ముదిరాజ్ కాలనీలో కనీస సౌకర్యాలు లేక సమస్యలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎప్పుడో దశాబ్ద కాలం క్రితం నిర్మించిన మురికి కాలువలు ధ్వంసం కావడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురుగు నీరు కాలనీ రోడ్లపై నిలిచి మడుగులా తయారై ప్రజల ఇళ్లముందు దుర్గంధం వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు ఆవాసం ఏర్పర్చుకుంటున్నాయని దీంతో కాలనీ వాసులు తరచూ రోగాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. భూగర్భ డ్రైనేజీ కోసం రోడ్డును అడ్డంగా తవ్వేయడంతో కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారి నడవడానికి వీలు లేకుండా తయారయ్యాయి. వర్షకాలం కావడంతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచి ఉంటుంది. కాలనీ ప్రజలు చిన్న పిల్లలు, వృద్ధులు అటుగా వెళ్లినప్పుడు గుంతలు ఉన్న విషయం తెలియక అందులో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను తవ్విన కాంట్రాక్టర్ ఏర్పడిన గుంతలను మొరం కంకర వేసి రోడ్డును మరమ్మతు చేయాల్సి ఉండగా తవ్విన మట్టితోనే తూ తూ మంత్రంగా పూడ్చి వేస్తున్నారు. మురుగుకాలువ నిర్మాణం కోసం తవ్విన ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడినప్పటికీ సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పురాతన కాలంలో వెలసిన కాలనీలో అన్ని ప్రాంతాలు ఇరుకుగానే ఉన్నాయి. చిన్నపాటి రోడ్లలో ఇళ్ల పక్కనే మురికి కాలువలు ఉండటం వల్ల పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువలు సకాలంలో శుభ్రం చేయక పోవడంతో అలాగే జీవనం సాగించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన మురికి కాలువలు పాడైపోయిన పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రధాన కాలువలు అయినప్పటికీ అధికారులు చుట్టుపక్కన గల మురికి కాలువలు నిర్మిస్తున్నారని అవసరమున్న మురుగు కాలువను నిర్మించడం లేదని పరిసర ఇళ్ల ప్రజలు తెలుపుతున్నారు. కాలనీలో మూల మలుపులపై మురికి కాలువలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో కాలనీ అంతా అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కాలనీలో మురుగు కాలువలు నిర్మించి రోడ్లను బాగు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీలు

### డివిజన్‌లో సమస్యలు లేకుండా చూస్తా..



11వ డివిజన్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో తవ్విన రోడ్లతో ఇబ్బందులు ఉన్నాయి. డివిజన్‌లో అన్ని కాలనీలలో డ్రైనేజీల నిర్మాణం రూ.16 లక్షలతో పూర్తి చేశాం. 5 లక్షలతో కల్వర్టులు పూర్తి చేశాం. రూ.5 లక్షలతో బీటీ రోడ్డుకు టెండర్ వేశాం. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 50లక్షల పనులు ఉన్నాయి. టెండర్ పూర్తి కాగానే ఈ పనులు కూడా పూర్తిచేస్తాం. అన్ని డివిజన్‌లలో పనులు సమానంగా చూడాలని ఎమ్మెల్యే చొరవ తీసుకొని మా డివిజన్‌లో సమస్యలు లేకుండా చూడాలి.

**- జాలిగం సునీత గోపాల్, కార్పొరేటర్**

## నేటి బీడీ సదస్సును జయప్రదం చేయండి: టీఎన్‌టీయూసీ

**సుభాష్‌నగర్:** బీడీ కార్మిక సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో బీడీ పరిశ్రమపై జీఎస్టీ పన్ను రద్దు చేయాలని కోరుతూ శనివారం న్యూ అంబేద్కర్ భవన్‌లో జరిగే జిల్లా బీడి సదస్సును బీడీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కోయేడి నరసింహులు, కార్యదర్శి కస్తూరి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీడీ పరిశ్రమను నమ్ముకుని లక్షలాదిమంది బీడీ కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్ను విధించడంతో బీడీ పరిశ్రమ సంక్షోభంలో పడి బీడీ కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. బీడీ పరిశ్రమను రక్షించాలంటే జీఎస్టీ పన్నును బీడీ పరిశ్రమకు మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు కలిసి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ నిర్ణయంలో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో బీడీ కార్మిక సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జాతీయ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు

**పెద్దబజార్:** భారతీయ జనతా యువ మోర్చ ఆధ్వర్యంలో శనివారం బోధన్‌లో జాతీయ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు న్యాలం రాజు అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రగతినగర్‌లోగల బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలను 5వ తేదీ నుంచి బోధన్ నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గెలిచిన వారికి జిల్లాస్థాయిలో ఆడ టం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 94401 84639, 98856 07181 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షుడు రోషన్‌లాల్ బోరా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ విక్రమ్‌రెడ్డి, తారక్ వేణు గోపాల్, రాందాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాలం రాజు

## రాఖీ కట్టి హెల్మెట్‌లు అందజేసిన జాగృతి సభ్యులు



హెల్మెట్ అందజేస్తున్న దృశ్యం

**నిజామాబాద్ కల్చరల్:** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలువురికి రాఖీ కట్టి హెల్మెట్‌లు అందజేశారు. తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు అన్నా.. తమ్ముడూ.. రాఖీ కట్టుకో.. హెల్మెట్ పెట్టుకో.. అనే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మచ్చర్ల వరలక్ష్మీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సోదరులకు రాఖీ కట్టి హెల్మెట్‌లను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోదర సోదరీల బంధాన్ని తెలిపే పండుగ రాఖీ పండుగ అని ఈ కార్యక్రమాన్ని సందేశాత్మకంగా నిర్వహించాలనే ఉద్ధేశంతో తెలంగాణ వ్యాప్తంగా జాగృతి సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నవీనచారి, ప్రభావతి, అపర్ణపాటిల్, 31జిల్లాల కన్వీనర్‌లు పాల్గొన్నారు.

## 8 నుంచి రాఘవేంద్రస్వామి 346వ ఆరాధనోత్సవాలు

**నిజామాబాద్ కల్చరల్:** నగరంలోని సుభాష్‌నగర్‌లో గల శ్రీరాఘవేంద్ర స్వామి బృందావన సన్నిధి శ్రీమదుత్తరాధిమఠంలో రాఘవేంద్రస్వామి 346వ ఆరాధనోత్సవాలు 8 నుంచి ప్రారంభమవుతున్నాయని ఆలయ అధ్యక్షుడు నర్సన్న ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజున ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు నిర్మాల్యపూజ, 10 నుంచి 11 గంటల వరకు మన్యసూక్తసహిత ఫల పంచామృతాభిషేకం, 11గంటల నుంచి 12వరకు తులసి అర్చన, రజిత కవచ అలంకరణ, 12 గంటలకు మహా నైవేద్యం, వేదోక్తమంత్రపుష్ప సమర్పన ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 6 నుంచి 7గంటల వరకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, 7 నుంచి 8గంటల వరకు స్వస్తిహవచన మంత్రపుష్పం. 9వ తేదీన 8 నుంచి 11గంటల వరకు అభిషేకం, ప్రత్యేక అర్చనలు జరుగుతాయి. 11 గంటల నుంచి 12గంటల వరకు రథోత్సవం, 12గంటలకు అన్నదానం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి గీతాలాపనలు. 10వ తేదిన 8 గంటల నుంచి 11 గంటల వరకు తులసి అర్చన, హరి వాయూస్థుతి, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### రేపు నూతన రథోత్సవం

రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నూతనంగా తయారుచేసిన రథానికి ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు నరసన్న తెలిపారు. ఉదయం 9గంటలకు రథ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## ఆంగ్ల పుస్తక రచయితకు సన్మానం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డీఈవో

**నిజామాబాద్ అర్బన్:** గురుకుల మేయిన్స్ తెలుగు అకాడమీ ఆంగ్ల పుస్తక రచయిత జిల్లాకు చెందిన నందిపేట్ మోడల్ స్కూల్ పీజీటీ చంద్రశేఖర్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి నాంపల్లి రాజేశ్ ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్ ఇటీవల ప్రచురితమైన అబ్దుల్‌కలాంపై పుస్తకం హోప్ రిబార్న్‌లో ఒక పోయం కూడా రాశారని డీఈవో అన్నారు. చంద్రశేఖర్ జిల్లాకు జాతీయ స్థాయిలో పేరు తేవడం అభినందనీయమని డీఈవో అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి పద్మనాభం, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, రమణస్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

**నిజామాబాద్ అర్బన్:** ఈ నెల 3న నగరంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలలో విజయ్ హైస్కూల్ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నందున విద్యార్థులను శుక్రవారం పాఠశాల యాజమాన్యం అభినందించారు. విజేతలుగా నిలిచిన బాలికలను, పీఈటీని పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి, ప్రిన్సిపాల్ వసంత తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం